సోమశిలకు 12,992 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి సోమవారం ఎగువ ప్రాంతాల నుంచి 12,992 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో 73.024 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 2,600, ఉత్తర కాలువకు 100, కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

'ఉపాధి'లో అవినీతిపై పునర్విచారణకు ఆదేశాలు 8



వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న ఉదయగిరి పంచాయతీ బస్టాండ్

హమ్మయ్య.. వాన కురిసింది!

● మెట్టను పలకరించిన వరుణుడు

వాన కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న మెట్టవాసులను వరుణుడు కరుణించాడు. సోమవారం ఉదయగిరి ప్రాంతంలో ఓ మోస్తారు వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా వేసవిని తలపించేలా భానుడు భగ్గుమంటుండటంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. అయిదే, సోమవారం ఉదయం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి, చలిగాలులు వీచాయి. వర్షపు నీటితో పట్టణంలోని మురుగు కాలువలు పొంగిపొర్లాయి. రహదారులు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. పంచాయతీ బస్టాండ్ సెంటర్ చెరువును తలపించింది. ఈ వర్షం ఆరుతడి, ఉద్యాన పంటలకు ఎంతమేలు చేకూర్చింది.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)



పాతబిట్రగుంటలో రామచంద్రయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రభాకర్

పిడుగుపాటుకు గురై ఇద్దరు రైతుల మృతి

బిట్రగుంట/కందుకూరు, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పాతబిట్రగుంట, కందుకూరులలో సోమవారం పిడుగుపాటుకు గురై ఇద్దరు రైతులు మృతి చెందారు. విడవలూరు మండలానికి చెందిన రామచంద్రయ్య నాలుగేళ్ల క్రితం బోగోలు పాతబిట్రగుంటలో కాపురం ఉంటున్నాడు. పశువులు మేపడం, కూలిపనులు చేస్తూ భార్య నాగమణి, ఇద్దరు ఆడపిల్లల్ని పోషిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పశువులను తోలుకుని వెళ్లి తిరిగా రాలేదు. బంధువులు ఎంతగాలించినా ఆచూకీ తెలియరాలేదు. సోమవారం ఉదయం గ్రామ శివార్లలో రామచంద్రయ్య (40) మృతి చెంది ఉన్నట్లు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోగోలు ఎస్సై ఎస్.ప్రభాకర్, ఏఎస్సై కోటేశ్వరరావు, వీఆర్వో చందు, తలారి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తల, వీపు వెనుక భాగంలో కాలినట్లు గుర్తించారు. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో పిడుగులు పడినట్లు తెలియడంతో పిడుగుపాటుకు గురై రామచంద్రయ్య మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రయ్య మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

● కందకూరు మండలం మాచవరం ఎస్టీ కాలనీకి చెందిన తలపల రామ్మూర్తి(60) అనే గొర్రైలకాపరి పిడుగుపాటుకు గురై సోమవారం మృతి చెందాడు. మాచవరం కొండ సమీపంలో రామ్మూర్తి గొర్రెలను మేపుకుంటున్న సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. దీంతో రామ్మూర్తి కొండ సమీపంలో చెట్ల కిందకు వెళ్లాడు. ఇదే సమయంలో పిడుగుపడటంతో రామ్మూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

సేవలకు సత్కారం !

● ఎన్ఎస్ఎస్ వలంటీరు పృథ్వీరాజ్‌కు రాష్ట్రపతి అవార్డు ప్రదానం



వెంకటాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ద్వారా సామాజిక సేవాకార్యక్రమాల్లో విశిష్ట కృషిచేసిన ముమ్మల పృథ్వీరాజ్‌కు సోమవారం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము జాతీయ ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్ అవార్డును ప్రదానం చేశారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పృథ్వీరాజ్ బయోటెక్నాలజీ పూర్తి చేశారు. ఎన్ఎస్ఎస్ ద్వారా ఆయన మూడేళ్లపాటు రక్తదానం, మొక్కలు నాటడం, పచ్చదనం - పరిశుభ్రత, మహిళా సాధికారత, జాతీయ సమైక్యతా శిబిరం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య శిబిరాలు, పర్యావరణం పరిరక్షణ వంటి సామాజిక సేవకార్యక్రమాల్లో పాల్గొని పలువురి ప్రశంసలందుకున్నారు. ఈ సేవలకుగాను పృథ్వీరాజ్ జాతీయ ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీరు అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్‌ను వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఉదయ్ శంకర్ తదితరులు అభినందనలు తెలిపారు. కాగా పృథ్వీరాజ్ అనంతపురం జిల్లా సెట్టూరు మండలం చిన్నంపల్లికి చెందినవారు.



● ప్రాణాలు తీస్తున్న 'కోల్డ్‌రిఫ్'
● ఔషధ నియంత్రణ శాఖ తనిఖీలు
● జిల్లాలో సరఫరా లేదని నిర్ధారణ
● ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం

దగ్గు మందు.. నిషేధం!

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో చిన్నారుల మృతికి కారణమైన దగ్గుమందుపై కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమయింది. వెంటనే ఆయా రాష్ట్రాల్లో దగ్గుమందుపై నిషేధం విధించింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి కూడా హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో కోల్డ్‌రిఫ్ అనే దగ్గు మందు సరఫరా ఎలా ఉంది? అమ్మకాలు చేస్తున్నారా? తదితర విషయాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆరా తీశారు. కాగా జిల్లాలోనూ ఔషధ నియంత్రణ శాఖాధికారులు 2500లకుపైగా ఉన్న మందుల దుకాణాలను తనిఖీ చేసి, కోల్డ్‌రిఫ్ సరఫరా లేదని నిర్ధారించారు. దీంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

● తప్పిన ప్రమాదం

అనారోగ్యానికి గురైన పిల్లల తల్లిదండ్రులకు కోల్డ్‌రీఫ్ దగ్గు మందు అందుబాటులో లేకపోవటం, వైద్యులు కూడా ఆ మందును సిపార్సు చేయకపోవటంతో ప్రమాదం లేదని తెలుస్తోంది. చిన్న ఫార్మా కంపెనీ తయారు చేసిన ఈ కోల్డ్‌రిఫ్ మందులో విషపదార్థాల కారణంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 14 మంది చిన్నారుల చనిపోయారు. తమిళనాడులోని కాంచీపురంలో కోల్డ్‌రిఫ్ తయారు చేసే ఫార్మా కంపెనీ ఉంది. ఈ మందును ల్యాబ్‌లో పరీక్షించగా డైథైలిన్ గ్లైకాల్, ఇథైలిన్ గ్లైకాల్ వంటి ప్రమాకర రసాయనాలు ఉన్నట్లు గుర్తించి, కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అయితే మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఉన్న ఫార్మా కంపెనీల నుంచి జిల్లాలో అనేక ఔషదాలు చలామణి అవుతున్నాయి. ఈ నేపథ్యంలో కోల్డ్‌రిఫ్ దగ్గుమందు మాత్రం ఇంకా ఇక్కడికి రాలేదు.

సరఫరా లేదు



చిన్నపిల్లల ప్రాణాలు తీసిన కోల్డ్‌రిఫ్ దగ్గు మందుపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఆ దగ్గుమందుపై జిల్లాలో తనిఖీ చేశాం. అయితే ఎక్కడా సరఫరా లేదని తెలిసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో 14 మంది చిన్నారులు ఈ దగ్గుమందు వల్ల మృత్యువాత పడటం ఆందోళన కలిగించే విషయం. ఇలాంటివి జిల్లాలో జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.

- రమేష్‌రెడ్డి, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ

అమ్మకాలు లేవు!



జిల్లాలో కోల్డ్‌రిఫ్ దగ్గుమందు ఎక్కడైనా చలామణి అవుతుందా... అంటూ మేము కూడా ఆరా తీశాం. అయితే ఈ మందు సరఫరా లేదని తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మకాలు చేయవద్దని అన్ని ఔషధ దుకాణదారులను హెచ్చరించాం. ఎక్కడా కోల్డ్‌రిఫ్ దగ్గుమందు అమ్మకాలు జరగడం లేదు.

- పేరూరి ప్రదీప్, జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు





సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న స్వచ్ఛ వారీయర్ పద్మావతి, ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమిషనర్ గంగా ప్రసాద్

'స్వచ్ఛ' అవార్డుల ప్రదానం

ఆత్మకూరు/నెల్లూరురూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద పరిశుభ్రత రంగంలో విశిష్ట సేవలు అందించినందుకుగాను ఆత్మకూరు మున్సిపాలిటీకి, నెల్లూరులోని పారిశుధ్య కార్మికురాలు తాటిపర్తి పద్మావతికి స్వచ్ఛవారీయర్ అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం అందజేశారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆత్మకూరు చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమిషనర్ గంగాప్రసాద్‌లు ఈ అవార్డును అందుకున్నారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో రూ.లక్షలు దోచేశారు!



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పార్ట్‌టైమ్ జాబు. రూ.లక్షల్లో జీతం అంటూ సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో ప్రగల్భాలు పలికారు. వారి మాటలు నమ్మిన ఓ యువతి రూ.7.20 లక్షలు వారికి సమర్పించింది. తీరా ఉద్యోగం రాకపోవడంతో తాను పోయానని నమ్మి పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని పెద్ద బజారు ప్రాంతానికి చెందిన సయ్యద్ యాఫియాకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆగష్టు 31వ తేదీన పార్ట్‌టైమ్ జాబ్ వర్క్‌ఫర్మ్ హోమ్ అని పోస్టు వచ్చింది. దీంతో

- మిగతా 7లో..

మనుబోలు మండలం మడమనూరు గ్రామసంస్థకు చెందిన మహిళకు అవార్డు అందచేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, నుడా చైర్మన్ కోటంరెడ్డి, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు



ప్రజల భాగస్వామ్యంతోనే

స్వచ్ఛాంధ్ర విజయవంతం

● స్వచ్ఛత అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతమవుతోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో 2025 స్వచ్ఛత అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజన్-2047లో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సీఎం చంద్రబాబునాయుడు పది సూత్రాల కార్యక్రమాన్ని నిర్దేశించారని తెలిపారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రజలంతా భాగస్వాములైతేనే పరిసరాలు పరిశుభ్రంగా మారుతాయని వివరించారు. గ్రామస్థాయి నుంచి వివిధ వర్గాల వారికి స్వచ్ఛత అవార్డులు ప్రకటించటం సంతోషదాయకమని, వారి స్ఫూర్తితో మిగతావారు స్వచ్ఛత కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పేర్కొన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల కృషితోనే పట్టణాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ మన ఊరిని, మన ప్రాంతాన్ని ప్రేమించినప్పుడే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలనే అభిప్రాయం కలుగుతుందని చెప్పారు.

● పలువురికి అవార్డుల ప్రదానం

ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పరిధిలోని కావలి మండలం చెంచుగానిపాళెం విలేజ్ ఆర్గనైజర్(వీవో)కి, మనుబోలు మండలంలోని మడమనూరు వీవోకి, ఇందుకూరుపేట మండలం లేబూరు బిట్-2 వీవోకి, నెల్లూరు రూరల్ మండలం కాకుపల్లి వీవోకి, వెంకటాచలం మండలం పూడిపర్తి వీవోకి డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి సమక్షంలో కలెక్టర్ హిమాన్షుశుక్లా, జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ అవార్డులు అందచేశారు. అలాగా మెప్మా పరిధిలో ఆత్మకూరు మున్సిపాలిటీ టెంకాయతోపు స్లమ్ లెవల్ ఫెడరేషన్(ఎస్ఎల్ఎఫ్)కు, బుచ్చిలోని బుచ్చి-4 ఎస్ఎల్ఎఫ్‌కు, కందుకూరు మున్సిపాలిటీలోని ఇందిరాగాంధీ ఎస్ఎల్ఎఫ్‌కు స్వచ్ఛతా అవార్డులు వచ్చాయి. వీటిని మెప్మా పీడీ లీలారాణి సమక్షంలో సమాఖ్యల పదాధికారులు అందుకున్నారు.

తమిళ జాలర్ల అక్రమ చేపలవేటే కారణం

ఫిషింగ్ హార్బర్‌కు మరో 2 తమిళ బోట్లు

బిట్రగుంట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు సోమవారం తమిళనాడుకి చెందిన మరో రెండు మెకనైజ్డ్ బోట్లను మత్స్యకారులు చేర్చారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు, కారైకల్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల అక్రమంగా సముద్ర చేపటవేటను సాగిస్తుండగా ఆంధ్రరాష్ట్ర గంగపుత్రులు అడ్డుకుంటున్నారు. తమిళనాడుకి చెందిన బోట్లను అడ్డుకునేందుకు ఏపీలోని 160 తీరప్రాంతగ్రామాల మత్స్యకారుల సమావేశానంతరం ఏకాభిప్రాయానికి వచ్చారు. అందులో భాగంగా మేలో ఓ బోటును అదుపులోకి తీసుకున్నారు. సెప్టెంబరులో మరో బోటు రాగా, దాన్ని కూడా అడ్డుకున్నారు. కాగా శనివారం రామాయపట్నం హార్బర్ సమీపాన చెన్నారాయునిపాలెం తీరంలో అక్రమ చేపల వేట సాగిస్తున్న కడలూరు బోట్లను గుర్తించిన స్థానిక గంగపుత్రులు అడ్డుకున్నారు. చేపల వేట చేస్తున్న నాలుగు తమిళనాడు బోట్లలో రెండు పారిపోగా, మరో రెండు బోట్లను అడ్డుకుని రామాయపట్నం హార్బర్‌లో ఉంచి సోమవారం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చారు. అయితే రెండు బోట్లలో ఉన్న 24 మంది తమిళ జాలర్లను అధికారులు సురక్షితంగా రైళ్లలో వారి ఊళ్లకు పంపించినట్లు స్థానిక మత్స్యశాఖ అధికారులు తెలిపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు జిల్లా మత్స్యశాఖ జేడీ శాంతి, కావలి రూరల్ సీఐ, స్థానిక ఎస్సై, సిబ్బంది చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కాగా ఆంధ్రాలో అక్రమ చేపలవేట ఆపేంత వరకు తమిళ బోట్లను అడ్డుకుంటానే ఉంటామని రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు తెగేసి చెబుతున్నారు.



జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న కడలూరు మెకనైజ్డ్ బోట్లు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు - వివరాలు 8లో..

బ్రాహ్మణక్రాక పంచాయతీ విభజనపై గ్రామసభ

ప్రభుత్వం మారినా వైసీపీ నేతల బుద్ధి మాత్రం మారడంలేదు. ఓ చారిటబుల్ ట్రస్టు పేరుతో 565 జాతీయ రహదారి పక్కనే ఉన్న విలువైన స్థలంలో రాత్రి రాత్రే రేకులషెడ్ నిర్మించి విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు వెళ్లడంతో మేల్కొన్న రెవెన్యూ అధికారులు పరుగులు తీసి రేకులషెడ్‌ను తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన సంఘటన దుత్తలూరు మండలం నందిపాడులో చోటుచేసుకొంది.



వాగు పోరంబోకు స్థలంలో ఏర్పాటు చేసిన రేకులషెడ్

వైసీపీ నేత భూ దాహం!

● వాగు పోరంబోకు భూమి ఆక్రమణ? ● రాత్రికి రాత్రే రేకుల షెడ్డు నిర్మాణం
● ట్రస్ట్ పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు ● ఫిర్యాదులతో మేల్కొన్న రెవెన్యూ యంత్రాంగం
● షెడ్డు తొలగించి, ఫ్లెక్సీ ఏర్పాటు ● కఠిన చర్యలు తీసుకుంటాం : తహసీల్దారు

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నందిపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 226.2లో 1.71 ఎకరాల వాగు పోరంబోకు భూమి ఉంది. ఈ భూమి ఏర్పేడు-నకిరేకల్ జాతీయ రహదారి (నెం.565)కి పక్కనే ఉండటంతో మంచి ధర పలుకుతోంది. విలువైన భూమి కావడంతో అదే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నేత కన్నుపడింది. ఇంకేముంది.. రహదారి పక్కనే ఉన్న సుమారు ఏడు సెంట్ల స్థలాన్ని ఆక్రమించి ఏకంగా రాత్రిరాత్రే రేకుల షెడ్ నిర్మాంచాడు. ప్రస్తుతం ఇక్కడ సెంటు ధర రూ.5-6 లక్షల వరకు పలుకుతోంది. ఆ లెక్కన బహిరంగ మార్కెట్‌లో అక్రమించిన స్థలం సుమారు రూ.40 లక్షల వరకు ఉంటోంది. అయితే, ఈ ఆక్రమణ వ్యవహారం ఆ నోట.. ఈ నోట పడడంతో రెండు రోజుల తరువాత ఓ ట్రస్టు పేరుతో అనాథలకు ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. ప్రధాన రహదారి పక్కనే ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేదు. స్థలం ఆక్రమణపై ఇబ్బడిముబ్బడిగా ఫిర్యాదులు వెళ్లడంతో అప్పుడు రెవెన్యూ అధికారులు కళ్లు తెరిచారు. హుటాహుటిన అక్కడికి చేరుకుని వైసీపీ నేత నిర్మించిన రేకులషెడ్‌ను తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ వ్యవహారంపై తహసీల్దారు నాగరాజు మాట్లాడుతూ ఆక్రమిత స్థలంలో రేకులషెడ్ తొలగించి అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పూలే విగ్రహాల ఏర్పాటుకు స్థలం చూపండి

మనుబోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పూలే విగ్రహాల ఏర్పాటుకు స్థలం చూపాలని తహసీల్దారుకు సోమవారం మండల బీసీ ఐక్యవేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు. బడుగుల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే, ఆయన సతీమణి సావిత్రిబాయిపూలే విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ప్రధాన రహదారి పక్కన అనువైన స్థలం ఏర్పాటు చేయాలని తహసీల్దార్ రమాదేవిని నాయకులు కోరారు. అందుకు తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11423
వెండి కిలో ధర	రూ. 156900
వెండి ఒక గ్రాము	రూ. 160.90



పారిశుధ్యానికి ప్రాధాన్యత

ఎంపీడీవో సీహెచ్ శ్రీహరి

కోవూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ సీహెచ్ శ్రీహరి తెలిపారు. ఇటీవల వీధుల్లో చెత్తాచెదారం తొలగింపు, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణపై శ్రద్ధ పెట్టామన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఉదయాన్నే పింఛన్లు అందిస్తున్నట్లు వివరించారు.

?. మండలంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్న విమర్శలున్నాయి

!. అన్ని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు సిబ్బంది చెత్తాచెదారం తొలగిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల్ని పారిశుధ్య కార్మికులు నాశనం చేస్తున్నారు. స్పెషల్‌డ్రైవ్ చేపట్టడంతో వీధులన్నీ శుభ్రమయ్యాయి. సిబ్బంది ఇంటింటికీ తిరిగి వారానికి రెండు పర్యాయాలు చెత్త సేకరిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాం.

?. తాగు నీటి సమస్య ఉందా

!. తాగు నీటి సమస్య లేదు. ఎక్కడైనా సమస్య వస్తే గంటల వ్యవధిలోనే పరిష్కరిస్తున్నాం.

?. పింఛన్ల పంపిణీ ఎలా సాగుతోంది.

!. ప్రతీ నెలా పింఛన్ల పంపిణీ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేస్తున్నాం. పింఛన్ల పంపిణీని పరిశీలించిన జిల్లా అధికారులు మాకు ప్రథమ స్థానం ఇచ్చి ప్రోత్సహించారు. సిబ్బంది పనితీరును అభినందించారు.

?. అర్హత కలిగిన ఆటో డ్రైవర్లకు ఇంకా ఆర్థిక సాయం అందకపోతే..

!. మండల పరిధిలోని 773 మంది ఆటో డ్రైవర్లకు రూ. 15,000 చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. అర్హులై ఉండీ ఎవరికైనా ఆర్థిక సాయం అందకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. తప్పకుండా అర్హులైన ప్రతీ ఆటో డ్రైవరుకూ సాయం అందేలా చూస్తాం.

నేలతల్లి గొంతులో ప్యారోక్వాట్ విషం!

- పిచికారీ చేసిన గంటల్లోనే ఎండిపోతున్న పైర్లు
- మట్టి కణాల పటుత్వం లేక భూమి నిస్సారం
- భవిష్యత్తులో మట్టిలో గడ్డికూడా మొలవని దుస్థితి
- రైతులకు అవగాహన లేకే...



కాగులపాడు వద్ద ఎండిపోయిన కలుపు



సైమోక్సిన్ క్రిమిసంహారక మందు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరమైన 'ప్యారోక్వాట్' క్రిమిసంహారక మందుతో వ్యవసాయ భూములు విషతుల్యం అవుతున్నాయి. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులు పంట పొలాల్లో కలుపు మొక్కలు, గడ్డిని నివారించేందుకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తుంటారు. అవగాహన లేక వాడుతున్న ఇలాంటి విషతుల్యమైన మందుల వల్ల నేలకు పెద్ద ముప్పు పొంచి ఉంది.

భూసారం కోల్పోయి.. పంటలు ఎండిపోయి..

క్రిమిసంహారక మందుల వాడకం ఎక్కువయ్యేకొద్దీ భూములు విషతుల్యమవుతున్నాయి. భూసారం కోల్పోయి భవిష్యత్తులో గడ్డి కూడా మొలవని పరిస్థితి ఎదురవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పశువుల మేతకు ఉపయోగపడే వ్యవసాయ భూముల్లో కలుపు మందు పిచికారీవల్ల ఎన్నో రకాల గడ్డి, కలుపు మొక్కలు నిలువునా ఎండిపోతున్నాయి. భూమి సారం కోల్పోతుంది. క్రిమి సంహారక మందుల ప్రభావంతో వ్యవసాయ భూముల్లో మట్టి నిస్సారంగా మారుతుంది. మళ్ళీ మళ్ళీ మొలిచిన గడ్డి, కలుపు మొక్కల్లో పోషకాలు తగ్గిపోతున్నాయి. ఇలాంటి గడ్డి గేదెలు మేసినా అవి ఇచ్చే పాలు తగ్గిపోతాయి. పాలలో వెన్నశాతం తగ్గిపోతుంది. ప్రస్తుతం పాడి రైతులు పెంపుడు దాణానే ప్రధానంగా వాడుతూపాలశాతం, వెన్నశాతం పెంచుకుంటున్నారు. గేదెలు, ఆవులకు పెంపుడు గడ్డిని ప్రోత్సహిస్తూ పాడి రైతులను ఆదుకునేలా ప్రభుత్వం సహకారం అందిస్తోంది.

నేలలో ఆర్గానిక్ కార్బన్ తగ్గిపోతోంది



పొలాల్లో కలుపు, గడ్డిని నివారించేందుకు వాడే 'ప్యారోక్వాట్' క్రిమిసంహారక మందు చాలా ప్రమాదకరమైంది. దీనిని పిచికారీ చేసిన 12 గంటలలోపే గడ్డి, కలుపు మొక్కలు ఎండిపోతాయి. వ్యవసాయ నేలలు విషతుల్యమవుతాయి. ఆర్గానిక్ కార్బన్ తగ్గిపోయి మట్టి కణాలు ఒకదానికొకటి అనుబంధం కోల్పోతాయి. ఫలితంగా భవిష్యత్తులో మట్టి నిస్సారమై గడ్డి కూడా మొలవని పరిస్థితి ఏర్పడుతుంది. దీనికన్నా ప్రమాదకరమైన 'గ్లైకోసెట్' అనే కలుపు మందు వినియోగం వల్ల క్యాన్సర్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. అందుకే మూడేళ్ల క్రితం ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వం 'గ్లైకోసెట్' వాడ కాన్ని నిషేధించింది. దీని బదులు గ్లైకోసెట్ అమైన్ అనే మందును కలుపు మందుగా వాడుకలోకి తెచ్చింది. 'ప్యారో క్వాట్' క్రిమిసంహారక మందు పిచికారీ సమయంలో రైతులు, కూలీలు తప్పని సరిగా చేతులకు గ్లౌసులు, ముఖానికి మాస్కులు ధరించాలి. క్రిమి సంహారక మందులు, రసాయన ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడితే భవిష్యత్తులో వ్యవసాయ నేలల్లో భూసారాన్ని కాపాడుకునే అవకాశం ఉంటుంది.

- శ్రీహరి, మండల వ్యవసాయాధికారి

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

- వెంకటగిరి శాసనసభ్యుడు కురుగొండ్ల రామకృష్ణ



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

రాపూరు, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా సమస్యల పరిష్కా ర వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీడీవో మారెళ్ల భవాని అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అధికారులు, నాయకులు కలిసికట్టుగా పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతి లబ్ధిదారుని సమస్య త్వరితగతిన పరిష్కారమవుతుందని, సమస్యను పరిష్కరించలేని పక్షంలో తగిన కారణం కూడా ప్రజలకు తెలియజేస్తామన్నారు. అర్హత కలిగిన వారికి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కూడా మం జూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, ఎమ్మార్వో లక్ష్మీనర సింహం, మండలాధ్యక్షుడు దందోలు వెంక టేశ్వర్లు రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కోటి నాయుడు, సీనియర్ నాయకులు చెన్ను భాస్కర్ రెడ్డి, నల్లవడ్ల వెంకట రమణ రెడ్డి, మధు రెడ్డి, వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో పోటీ పరీక్షల కేంద్రం ప్రారంభం



నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూని వర్సిటీలో పోటీ పరీక్షల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రానికి డైరెక్టర్‌గా వర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జే విజేతను నియమించారు. దీంతో సోమవారం వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు నియామక పత్రాన్ని ఆమెకు అందజేశారు. ఈ కేంద్రం ద్వారా విద్యార్థులకు యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్, వివిధ కార్పొరేట్ సంస్థల పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తగలబెట్టిన వ్యక్తిని అరెస్టు చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి): చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహాన్ని తగలబెట్టిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి దేశం నుంచి బహిష్కరించాలని బహుజన సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, మురళి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేటు ట్రావెల్స్‌పై కొరడా

- 115 బస్సులపై కేసుల నమోదు
- స్వయంగా తనిఖీలు చేపట్టిన డీటీసీ



వాహనాలు తనిఖీలు చేస్తున్న డీటీసీ చందర్

వెంకటాచలం, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి) : దసరా పండుగ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవా ణా శాఖాధికారులు కొరడా ఝళిపించారు. వెంకటాచలం సమీపంలో ని టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి డీటీసీ బీ చందర్ స్వయంగా ఆర్టీఏ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధిక చార్జీలు వసూలు చేసిన 105 బస్సులు, ఓవర్ లోడ్ 9, సరైన పత్రాలు లేని ఒక బస్సు. మొత్తం 115 ప్రైవేటు ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు చేశారు. దీంతో రూ.11.41 లక్షల అపరాధ రుసుమును విధించారు. దసరా పండుగకు వచ్చి తిరిగి వారి స్వస్థలాలకు భారీ సంఖ్యలో వెళ్తున్న ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్‌పై ఉక్కుపాదం మోపారు. ఒకేసారి 115 ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. డీటీసీ చందర్ మాట్లాడుతూ దసరాకి సొంత ఊళ్లకు వచ్చి వెళ్లే వారి దగ్గరి నుంచి భారీగా ప్రైవేటు ట్రావెల్స్ వారు రవాణా చార్జీలు వసూలు చేస్తున్నట్లు రవాణా శాఖ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తం గా తనిఖీలు చేపట్టారన్నారు. నిబంధనలు అతిక్రమించి అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. జిల్లాలో తనిఖీలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో బ్రేక్ ఇన్స్పెక్టర్లు మురళీమోహన్, షఫీ, ఆర్టీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బిట్రగుంట/కావలిరూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం సున్నపుబట్టీ సమీపం లో జాతీయ రహదారిపై మోటారు బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో కావలి పట్టణం ఇందిరానగర్‌కి చెందిన షేక్ అహ్మద్(30) మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. కావలి నుంచి బేల్దారి పనులకు నెల్లూరుకు వెళ్లిన అహ్మద్ తిరిగి మోటారు బైక్‌పై కావలి వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు దగదర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాదావారిపాళెం వద్ద వ్యక్తి...

నెల్లూరు రూరల్ : నెల్లూరు రూరల్లోని సాదావారిపాళెం వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. 40-45 ఏళ్ల మధ్య వయస్కుడు మరణించాడు. మద్యం తాగి స్పృహ కోల్పోయి మరణించి ఉండవచ్చని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం అందాల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి ...



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

కలిగిరి: మండలంలోని వెలగపాడు సచివాలయం ముం దున్న బస్ షెల్టర్‌లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెం దాడు. స్థానికులు గుర్తి ంచి పోలీసులకు సమా చారం ఇచ్చారు. మృతుడికి సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉండవచ్చని, చొక్కా కాలర్‌పై పవన్ మెన్స్‌వేర్ పామూరు అని ఉంది. వివరాలు తెలిసినవారు తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపారు.

పెన్నాలో గల్లంతైన కోటయ్య దుర్మరణం



కోటయ్య (ఫైల్)

నెల్లూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడ రేవు వద్ద పెన్నా నదిలో ఈతకెళ్లి గల్లంతైన కోటయ్య(24) మృత్యువాత పడ్డాడు. అతని మృతదేహాన్ని గజఈతగాళ్లు సోమవారం గుర్తించి బయటకు తీసుకువచ్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రూరల్ పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. కాగా, ఆదివారం నలుగురు యువకులు ఈ ప్రాంతంలో ఈతకెళ్లగా ముగ్గురు నీట మునిగిన విషయం విదితమే. వారిలో ఒకరి ప్రాణాలతో బయటపడగా నరసింహ (19) అనే యువకుడి మృతదేహాన్ని ఆదివారమే గుర్తించారు. పెన్నా నది నీటిలో గల్లంతైన కోటయ్య సోమవారం వెలికితీశారు. వీరిద్దరి మరణంతో వారి స్వగ్రామమైన దేవరపాళెంలో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నం టాయి. బాధిత కుటుంబాలను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరామర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గుంజి వేణు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సత్కారం



సరస్వతిని సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

మనుబోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లి ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలు సరస్వతి ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నెల్లూరు టౌన్‌హాలులో ఘన సన్మానం అందుకున్నారు. ఇందుకూరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించారు. మనుబోలు మండలం నుంచి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన సరస్వతిని ట్రస్టు చైర్మన్ బద్దిపూడి శీనయ్య, సభ్యులు శాలువా, జ్ఞాపిక, ప్రశంసపత్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల హెచ్‌ఎం. కాంతారావు, ఉపాధ్యాయులు సోమా పద్మారత్నం ఆమెను అభినందించారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

ఉదయగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యావనరుల కేంద్రంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు రెండవ సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలభిషేకం

అనంతసాగరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిలలో సోమవారం ఆటోవాలాలు కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం రూ. 15వేలు అందచేయడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శాఖమూరి సుబ్బారావు, ఉప్పల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి

ఉదయగిరి, అక్టోబు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న వర్ధంతి కార్యక్రమం ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా నాయకుడు నాగరాజు, నాయకులు తిరుపతి, పెంచలరాజు పాల్గొన్నారు.

పోషణ 2.0 అమలుపై ప్రత్యేక బృందం సర్వే



విద్యార్థుల పఠనాసక్తిని పరిశీలిస్తున్న ప్రత్యేక బృంద సభ్యులు

ముత్తుకూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ పోషణ 2.0 పథకాల అమలుపై సర్వే నిర్వహించేందుకు నీతి అయోగ్ నుంచి ప్రత్యేక బృంద సభ్యులు పర్యటించారు. తోటపల్లి గూడూరు మండలం పాపిరెడ్డిపాలెం, నరుకూరు ఎస్టీ కాలనీ, ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం దళితవాడ అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం బృంద సభ్యులు సందర్శించి కనీస వసతులు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం, పిల్లలకి ఆడుకోవడానికి ఆట స్థలం, ఆట వస్తువులు ఉన్నాయా లేవా, అంగన్‌వాడీ కేంద్రం భవన పరిస్థితిని పరిశీలించారు. రిజిస్టర్‌లు, గ్రోత్ మానిటరింగ్ పరికరాలని తనిఖీ చేశారు. సంబంధిత అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదు కాబడిన లబ్ధిదారులను గృహ సందర్శన చేసి, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సకా లంలో పోషకాహార పంపిణీ జరుగుతుందా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రీ స్కూల్‌కి వ చ్చే పిల్లలకి అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు, పాలు, హాట్ మీల్స్ అందుతున్నాయా లేదా అని వారి తల్లిదండ్రుల వద్ద సమాచారం సేకరించారు. పిల్లల ఎత్తులు, బరువులు తూచి కార్యకర్త పోషణ ట్రాకర్ నందు నమోదు చేసిన బరువులు, ఎత్తుల వివరాలు చెక్ చేశారు. ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాలలో కమ్యూనిటీ ఈవెంట్స్ జరుపుతు న్నారా? లేదా? అనే వివరాలని లబ్ధిదారులను వాకబు చేసి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఈసీసీఐ కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రశ్నించారు. యాప్‌లలో లబ్ధిదారుల నమోదు, ఫేస్ కాప్చరింగ్ వంటి పనులలో ఇబ్బందులు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మీదేవి, సెక్టార్ సూపర్ వైజర్లు లలితాంబ, అమ్మన్నమ్మ, రాధిక పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత శ్యాంసుందర్ హఠాన్మరణం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఇందుకూరుపేట, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి) : ఇందుకూరుపేట తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఇందుకూరుపేట మాజీ సర్పంచ్, శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కంచర్ల శ్యాంసుందర్ (65) సోమవారం హఠాన్మరణం చెందారు. నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని ఆయన భౌతికకాయానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాళులర్పించారు. శ్యాం తో ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మునగాల రంగారావు, పేట మురళి, పేట శ్రీనివాసులు, బాలబొమ్మ వెంకటేశ్వర్లు, హకీమ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు బైపాస్ రోడ్డు పనులు వేగవంతం



బైపాస్‌రోడ్డుకు ఇరువైపులా తోలిన గ్రావెల్

ఆత్మకూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని హనుమాన్ జంక్షన్ వద్ద నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి నుంచి ఆత్మకూరు పట్టణంలోకి చేపట్టిన బైపాస్‌రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బైపాస్ నిర్మాణానికి రూ.6.31 కోట్లు మంజూరు చేయించారు. దీంతో అధికారులు పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగించి సర్వేచేసి రోడ్డు హద్దు వరకు రాళ్లు వేశారు. రోడ్డుకు ఇరువైపుల గ్రావెల్ తోలి చదును చేశారు. బైపాస్ రహదారికి సెంటర్ డివైడర్, లైటింగ్, వాకింగ్ ట్రాక్‌కు మార్జిన్ ఉండేలా నిర్మాణం చేపట్టనున్నారు. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఆత్మకూరు నుంచి నెల్లూరుకు వెళ్లే వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని హర్షం వ్యక్తమవుతోంది.

వార్డుల విభజనలో అభ్యంతరాలపై వినతి



వినతిపత్రం ఇస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం మున్సి పాలిటీలో 27 వార్డుల విభజన ప్రక్రియలో అవకతవకలు, అభ్యంతరాలపై ప్రతిపక్ష, విపక్షాలు వైసీపీ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు సోమవారం కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రాలు సమర్పించారు. ఆయా పార్టీల నాయకులు విలేకరులతో మాట్లాడుతూ పురపాలకశాఖ సర్క్యులర్ ప్రకారం వార్డుల విభజన జరగలేదన్నారు. ఇస్కపాళెం పరిధిలోని 3వ వార్డును ఇతర వార్డుల మీదుగా తీసుకెళ్ళి ఇస్కపాళెం పరిధిలో కలపడం, ముందు వార్డులు వెనక్కి, వెనుక వార్డులు ముందుకు కలిపి తప్పిదాలు చేశారని తెలిపారు ఫీల్డుమీద సూచించిన సర్వే నెంబర్లు ఏ రెవెన్యూ గ్రామానికి చెందినవనేది సూచించక పోవడం, ల్యాండ్ మార్కు, ప్రాంతాల పేర్లు లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పందించిన కమిషనర్ పరిశీలించి సరిదిద్దుతామన్నారు. ఈ కార్య క్రమంలో వైసీపీ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు ఎస్‌కే షాహుల్, వింజమూరు వెంకటేశ్వర్లు, ముత్యాల గుర్నాధం, చల్లకొలుసు మల్లికార్జున, పోతంశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కామాక్షితాయిని దర్శించుకున్న వేములపాటి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి కామా క్షితాయి ఆలయంలో సోమవారం ఏపీ పట్టణ మౌళి క సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్, జిల్లా జనసేన పార్టీ పర్యవేక్షకులు వేములపాటి అజయ్‌కుమార్ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

అవార్డు అందుకున్న మెప్మా అధికారులు



కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మెప్మా సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం మెప్మా 4వ సమాఖ్య ఖాజానగర్‌లో ఏర్పాటు చేసిన టెర్రస్ గార్డెన్‌కు సంబంధించి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన విషయం విదితమే. ఈ మేరకు సోమవారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని తిక్కనభవన్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేతులమీదుగా మెప్మా పీడీ లీలారాణి, ఐబీ అంకయ్య, సీవో నర్మద, ఆర్‌పి షబ్‌నమ్, సమాఖ్య అధ్యక్షురాలు గౌసియా, మహేంద్ర అవార్డును అందుకున్నారు.

స్వచ్ఛ గ్రామ పంచాయతీగా కరటంపాడు

ఆత్మకూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరటంపాడు పంచాయతీ స్వ చ్ఛ ఆంధ్ర గ్రామ పంచాయ తీగా ఎంపికైన సందర్భంగా పంచాయతీ కార్యదర్శి షేక్ షఫీ జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్ల చేతుల మీదుగా నెల్లూరులో సోమవారం అవార్డు అందుకున్నారు. దీంతో సర్పంచ్, కార్యదర్శికి గ్రామప్రజలు అభినందనలు తెలిపారు.

మల్లికార్జున్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

వెంకటాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెముడుగుంట పంచాయతీ జిల్లా జైలుకెళ్లే మార్గంలో ఇటీవల జరిగిన హత్య కేసు మిస్టరీని పోలీసులు సాంకేతిక ఆధారంతో ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గత నెల 30వ తేదీన బుజబుజ నెల్లూరు పరిధిలోని న్యూకాలనీకి చెందిన వల్లూరు మల్లికార్జున్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్య బంగారు నగల కోసమే జరిగినట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. సమీప బంధువే ఈ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు న్యూకాలనీలో నివాసం ఉంటున్న వల్లూరు మల్లికార్జున్ గత నెల 29వ తేదీ రాత్రి నుంచి కనిపించలేదు. 30వ తేదీన నక్కలకాలనీ సమీపంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. స్వయంగా జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సంఘటన స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. ఈ హత్య కేసును పోలీసులు చాలెంజ్‌గా తీసుకుని ఆరు రోజుల్లోనే సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఛేదించారు. బుజబుజ నెల్లూరు పరిధిలోని న్యూకాలనీలోనే మల్లికా ర్జున్ సోదరుడి కుమార్తె భర్త వెలగల పవన్ కళ్యాణ్ నివాసం ఉం టూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పవన్ కళ్యాణ్ మల్లికార్జున్‌ను నగదు అడగ్గా ఇవ్వకపోవడంతో మల్లికార్జున్‌పై కోపం పెంచుకున్నాడు. దీంతో గత నెల 29వ తేదీన మల్లికార్జున్‌కు మద్యం తాగించాడు. పక్కా ప్రణాళికతో కిరాతకంగా హత్య చేసి మల్లికార్జున్ బంగారు గొలుసు, ఉంగరం లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. సాంకే తిక పరిజ్ఞానం ఆధారంగా పోలీసులు పవన్ కళ్యాణే హత్యకు పాల్ప డినట్లు గుర్తించారు. తానే హత్య చేసినట్లుగా పవన్ కళ్యాణ్ అంగీక రించా డు. దీంతో అతడిని అరెస్టు చేసి సోమవారం కోర్టుకు హాజరు పరచ గా ఈనెల 17 వరకు రిమాండ్ విధించినట్లు సీఐ సుబ్బా రావు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బైక్ చోరీపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరులోని సరస్వతి నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు ఈ నెల 4వ తేదీ ఉదయం మూలాపేట అలంకార్ సెంటర్ సమీపంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు వెళ్లారు. బ్యాంకు బయట తన బైక్‌ను పార్క్ చేసి లోపలికి వెళ్లారు. పనిముగించుకొని బయటకు వచ్చిచూడగా వాహనం కనిపించలేదు. చుట్టు పక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో బాధితుడు సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	135
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	266
కోడిగుడ్ల ధర (100):	525



ఇరుకళల పరమేశ్వరి ఆలయ హుండీల లెక్కింపు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇరుకళల పరమేశ్వ రి ఆలయంలో సోమవారం హుండీల లెక్కింపు జరిగిం ది. దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 6వతేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.3,57,773 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమాన్ని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ డీ శ్రీనివాస్, ఆలయ ఈవో వీ గిరికృష్ణ పర్యవేక్షించారు. పాలక మండలి ఛైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్, సభ్యులు, ప్రధాన అర్చకుడు పీ చంద్రశేఖరస్వామి, పీ దైవజ్ఞ ఆచారి తదితరులు, పరకామణి సిబ్బంది పాల్గొన్నారు.

దోమల రహిత నగరమే లక్ష్యం

- నెల్లూరు సిటీలో 47 పార్కుల అభివృద్ధి : మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి) : నెల్లూరు నగరాన్ని దోమల రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఈ క్రమంలో మురుగు నివారణ చర్యల్లో భాగంగా భూ గర్భ డ్రైనేజీ మిగులు పనులకు రూ.160 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. నగర ప్రజల ఆహ్లాదానికి 47 పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఏసీ నగర్‌లో రూ.25 లక్షలతో ఆధునీకరించిన మాగుంట సుబ్బరామి రెడ్డి మున్సిపల్ పార్కును సోమవారం ఆయన ప్రారంభించారు. ఇప్పటికే 40 పార్కులను ఆధునీకరించినట్లు తెలిపారు. పార్కులోనే స్థానిక కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం సంతపేట వద్ద ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన మార్కెట్‌ను సందర్శించి, నష్టపోయిన వ్యాపారులను మంత్రి పరామర్శించారు. వచ్చే సోమవారంలోపు దుకాణాలకు మరమ్మతులు చేయించి వ్యాపారులకు అందచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, నగర కమిషనర్ నందన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ, అజీజ్

- తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్ల పంపిణీ

నెల్లూరు (వైద్యం)(ఆంధ్రజ్యోతి) : చిరువ్యాపారుల కళ్లలో ఆనందం చూస్తున్నామని పురపాలక మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 70 తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్లను నిరుపేదలకు అందచేశారు. పీ4 పథకం ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలుస్తామని చెప్పారు. ఇప్పటి వరకు 476 మందికి తోపుడు బండ్లు అందచేసినట్లు తెలిపారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ 75 మంది వీధి వ్యాపారులకు ఒకేసారి మంత్రి నారాయణ తోపుడు బండ్లు పంపిణీ చేయటం సంతోషంగా ఉందన్నారు. సంచార వాహనాల ద్వారా ఆదాయా న్ని పెంచుకునే అవకాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, విజేత రెడ్డి, ధర్మవరం సుబ్బారావు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అప్సా రాష్ట్ర కార్యదర్శిగా సుబ్బయ్య

నెల్లూరు (విద్య), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) రాష్ట్ర కార్యదర్శిగా నగరంలోని శ్రీనివాస హైస్కూల్ అధినేత ఎన్‌వీ సుబ్బయ్య నియమితులయ్యారు. విజయవాడ కేంద్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సుబ్బయ్యను ఎన్నుకున్నారు. రాష్ట్ర వ్యవశాయ శాఖ మంత్రి కే అచ్చన్నాయుడు చేతుల మీదుగా నియమాక పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రాజు, గౌరవాధ్యక్షుడు సుందరం, సభ్యులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న సుబ్బయ్య

ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఐకాన్ అవార్డులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లాకు చెందిన పలువురు ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఐకాన్ అవార్డులు అందచేశారు. బుజబుజ నెల్లూరు శ్రీనివాస హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం సుస్మిత ఉత్తమ అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకోవడంతో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న సుస్మిత



ట్రాఫిక్ చక్రబంధం

నెల్లూరు అనగా ట్రాఫిక్ చక్రబంధం గుర్తు వస్తుంది. నగర రోడ్లపై ప్రయాణం నరకం అనే స్థాయికి పరిస్థితులు దిగజారాయి. ప్రభుత్వాలు మారుతున్నా... కొత్తగా ఉన్నతాధికారులు ఎందరు వస్తున్నా ఈ ట్రాఫిక్ జంజాటానికి పరిష్కారం చూపేవారు మాత్రం కనిపించడం లేదు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయిస్తున్నాము, నగర రోడ్లపై ఆక్రమణలు తొలగిస్తాము, పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేస్తామనే ప్రకటనలు అటు పాలకులు, ఇటు అధికారుల నుంచి తరచూ వినపడేవే!. జిల్లా కలెక్టర్లు, ఎస్పీ మరినప్పుడల్లా నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలంటూ ఆదేశాలు జారీ చేస్తూనే ఉంటారు. వాస్తవంలో మాత్రం అవి కార్యరూపం దాల్చడం లేదు.. ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరడం లేదు.

- నగరంలో ఆటోలు, సిటీ బస్సుల ఇష్టానుసారం
- పార్కింగ్ ప్రాంతాల్లా బృందావనం, పొగతోట
- రోడ్ల ఆక్రమణతో సమస్య తీవ్రం
- నిత్యం నరకం చూస్తున్న ప్రజలు
- కొత్త ఎస్పీ అయినా పరిష్కరించేనా..!?

నెల్లూరు(క్రైం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. రోడ్లు విశాలంగా లేకపోవడం, షాపింగ్ మాల్స్ కమర్షియల్ కాంప్లెక్సులు, దుకాణాలకు పార్కింగ్ ప్రాంతాలు లేకపోవడం, రోడ్లపై ఆక్రమణలు విపరీతంగా పెరగడం, వాహనాల సంఖ్య ప్రతి ఏడాది రెండింతలు అవుతుండటంతో నగరం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుపోతోంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆటోలు, అక్రమ ఆటో స్టాండ్లు, రోడ్ల మధ్య సిటీ బస్సులు నిలపడం... ఇలా చెప్పుకుంటూపోతే నగరంలో ట్రాఫిక్ అంతరాయానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు చలానాలు రాయడానికే పరిమితం అవుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఏదేమైనా ట్రాఫిక్ సమస్యతో ప్రతీ రోజు ఉద్యోగాలకు వెళ్లే వారు, విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు, వైద్యశాలలకు వెళ్లే రోగులు, అంబులెన్స్‌లు, ఫైర్‌ఇంజన్లు ఇలా అందరికీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పార్కింగ్ ప్రాంతాలు ఏవీ?

నగరంలో ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాలను గుర్తించామని ఆ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తామని ఇప్పటికే పలువురు అధికారులు అనేక సార్లు చెప్పారు. అయితే ఆ మాటలు కార్యరూపం దాల్చడం లేదు. సెంటర్ పార్కింగ్ ఉన్న ప్రాంతాల్లో రోడ్ల చివర కూడా వాహనాలు నిలుపుతున్నారు. వీటిని పోలీసులు నియంత్రించాల్సి ఉంది.

కొత్త ఎస్పీ దృష్టి సారించేనా?

నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర ప్రజలతోపాటు వివిధ పనుల నిమిత్తం నెల్లూరుకు వచ్చేవారు కోరుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్పీ డాక్టర్ అజిత ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడతారని అందరూ ఆశిస్తున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు వాహనాల తనిఖీకే అధిక ప్రాధాన్యత ఇస్తూ ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించక పోవడంతో నగర ప్రజలకు ట్రాఫిక్ నరకంగా మారింది. ఈ క్రమంలో ఎస్పీ డాక్టర్ అజిత వెజెండ్ల ట్రాఫిక్ అంతరాయంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ప్రధాన కారణాల్లో కొన్ని...

- ఆత్మకూరు బస్టాండు పక్కన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సిటీ బస్సుల కోసం స్టాండు ఏర్పాటు చేయడంతో బస్సులు ఎక్కడ పడితే అక్కడ నిలపేస్తున్నారు. వాటిని ఆనుకొని వందల ఆటోలు నిలిపి ప్రజలను ఎక్కించుకోవడంతో ఈ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.
- పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద కోవూరు వైపు వెళ్లే ఆటోలు, సిటీ బస్సులు ఇష్టానుసారంగా నిలివడంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది.
- స్టోన్‌హౌస్‌పేటకు వెళ్లే మార్గంలో నాలుగు వంతెనలు ఉండగా పాత వంతెనలు రెండింటినీ ఆటో స్టాండ్లు, పండ్ల బండ్ల వారు ఆక్రమించేశారు. మిగిలిన రెండు బ్రిడ్జిలపైన కూడా ఆటోలు, సిటీ బస్సులు అడ్డంగా నిలిపి వేస్తున్నారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని దుకాణాలలో ఏ ఒక్కదానికి కూడా పార్కింగ్ స్థలం లేదు. వినియోగదారులు, దుకానదారులు రోడ్లపైనే వాహనాలు నిలిపి వేస్తున్నారు. నిత్యం రూ.కోట్లలో వ్యాపారం జరిగే పప్పులవీధిలో సరుకుల దిగుమతికి భారీ లారీలు, వాహనాలు వస్తుండటంతో అక్కడ రోజూ ట్రాఫిక్ తిప్పలే!
- మినీ బైపాస్‌లో పూలే బొమ్మకు ముందు ఆటో స్టాండ్లు ఉండటంతో బస్సులను బలవంతంగా చెయ్యెత్తి నిలుపుతున్నారు.
- శ్రీనివాస అగ్రహారం ప్రాంతంలో సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు పదుల సంఖ్యలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిలుపుతున్నారు. అవన్నీ పెద్ద పెద్ద బస్సులు కావడంతో మిగిలిన వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- టీడీపీ కార్యాలయం నుంచి వనంతోపు సెంటర్ వరకు మినీ బైపాస్ రోడ్డుకు ఇరువైపుల చికెన్ పకోడా, ఫ్రైడ్ రైస్, స్టిక్స్... ఇలా అనేక వ్యాపారాల బండ్లు ఏర్పాటు చేశారు. వీటి వద్ద కొనుగోలుకు వచ్చిన వారు రోడ్లపైనే వాహనాలు నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. పైగా ప్రమాదాలు జరుగుతున్నాయి.
- అయ్యప్పగుడి సెంటర్‌లోని నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ పోలీసులు సక్రమంగా విధుల్లో ఉండక పోవడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది.
- వేదాయపాలెం సెంటర్, కరెంటాఫీసు సెంటర్‌లో ఆక్రమణలు పెరిగి, అవి పార్కింగ్ ప్రాంతాలుగా మారుతున్నాయి.
- బొల్లినేని వైద్యశాల ఎదుట పెట్రోల్‌బంకు నుంచి వాహనాలు బయటకు రావడం, అక్కడే మలుపు తిరగడం, రోడ్లు చిన్నవి కావడం ఇలా అనేక కారణాలతో నిత్యం వాహనాలు నిలిచి పోతుంటాయి.
- ఆర్టీసీ ప్రధాన బస్టాండు వద్ద చెన్నై ప్రైవేటు బస్సులు, ట్రావెల్స్ బస్సులు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, అక్రమ ఆటో స్టాండ్లతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది.
- ట్రాఫిక్‌కు అడ్డా అంటే కూరగాయల మార్కెట్ సెంటర్ అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ప్రాంతంలోని పెద్దపెద్ద హోటల్స్‌కు సైతం పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఈ ప్రాంతం పార్కింగ్ ఏరియాగా మారిపోయింది.
- లీలామహల్, పాత జడ్పీ కార్యాలయం వద్ద ఉన్న కళాశాలలు వదిలితే చాలు వీఆర్‌సీ కూడలిలో గంటకుపైగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ఈ ప్రాంతాల్లో రోడ్డు మధ్యలో సెంట్రల్ పార్కింగ్‌ను పోలీసులు ఏర్పాటు చేశారు. అయితే రోడ్డుకు సెంటర్‌తో పాటు అటు, ఇటు కూడా వాహనాలు నిలుపుతుండటంతో రోడ్డంతా పార్కింగ్ ప్రాంతంగా మారిపోయింది.

కదిరినేనిపల్లిని విడగొట్టొద్దు

- అంబేడ్కర్ విగ్రహానికి వినతి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : మర్రిపాడు మండలంలోని కదిరినేనిపల్లిని చిన్న మాచనూరు పంచాయతీ నుంచి విడగొట్టొద్దని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం నెల్లూరులో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. స్థానిక ఎంపీటీసీ బాల గురవయ్య, ఓ బాలకృష్ణారెడ్డి తదితరులు మాట్లాడుతూ తమ గ్రామంలో వెయ్యి మందికిపైగా జనాభా ఉన్నారని, బ్రిటీష్ కాలం నుంచి చిన్నమాచనూరు పంచాయతీలో భాగంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా మారుస్తున్నారని, చిన్న మాచనూరు పంచాయతీలోనే కొనసాగించాలని కోరారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి

- అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధిపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి హెచ్చరించారు. సోమవారం నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీ, జాఫర్ సాహెబ్ కెనాల్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవటం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకస్మికంగా బరువు తగ్గటం వంటి లక్షణాలతో బాధపడుతుంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాల్లో గళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలు పీహెచ్‌సీల్లో ఉచితంగా మందులు ఇస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో క్షయ నివారణ విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎంఆర్ గ్రూప్‌నకు స్వచ్ఛ అవార్డు



అవార్డు అందుకుంటున్న బీఎంఆర్ గ్రూప్ సభ్యులు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పేరొందిన బీఎంఆర్ గ్రూప్‌నకు స్వచ్ఛ పరిశ్రమ అవార్డును ప్రభుత్వం తరుపున సోమవారం జిల్లా కలెక్టర్ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణఆంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను సాధించడంలో సంస్థలు, వ్యక్తులకు అత్యుత్తమ పనితీరును గుర్తించి అవార్డులను అందజేసింది. జిల్లా స్థాయిలో మెగా స్కేల్ కేటగిరీ కింద బీఎంఆర్ గ్రూప్ ఎంపికైంది. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణమ్మ, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుజబుజ నెల్లూరులో కార్డన్ సెర్చ్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని బుజబుజ నెల్లూరులో సోమవారం తెల్లవారుజామున వేదాయపాలెం స్టేషన్ పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ప్రతీ ఇంటిని తనిఖీ చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు సెర్చ్ నిర్వహించామని చెప్పారు. సరైన పత్రాలు లేని 13 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని, ఏడుగురు రౌడీషీటర్లు, 13 మంది అనుమానితుల వేలిముద్రలను సేకరించినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు, డయల్ 112, 100కు తెలియజేయాలని ప్రజలను కోరారు.



ఓ ఇంటిలోని వారి వివరాలు పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

జాతీయ పోటీలో 'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు (విద్య), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో యాత్ర-2025 పేరుతో నిర్వహించిన జాతీయ స్థాయి ప్రాజెక్టుల పోటీలో నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనతో బహుమతులు సాధించారని ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ దత్తాత్రేయశర్మ తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థుల అభినందన కార్యక్రమం సోమవారం కళాశాలలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు ప్రవ్యాత్, జహీర్, హేమంత్ ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్‌లో ప్రథమ బహుమతి సాధించారని చెప్పారు. అలాగే గౌతమ్ ఈశ్వర్, రసూల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో ప్రథమ బహుమతి, మొహిద్దీన్, వర్షిత, అవినాష్ టెక్నికల్ క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి, మెకానికల్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ఏవీఎస్ శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ యశ్వంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

రోడ్డు ఆక్రమిత దుకాణాలు తీసేస్తాం

- కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగిస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన నగర వాసుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పనులు అన్నీ డివిజన్లలో చేపట్టామన్నారు. రోడ్లను ఆక్రమించిన దుకాణాలను తొలగిస్తున్నామని చెప్పారు. కార్పొరేషన్ స్థలాలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన వాటిని కూడా తొలగిస్తామని స్పష్టం చేశారు. నగరంలో నిర్దేశించిన ప్రదేశాల్లోనే రోడ్డుమార్జిన్ వ్యాపారులు కార్యకలాపాలు చేసుకోవాలన్న మార్గదర్శకాలు రూపొందిస్తున్నామని చెప్పారు. రోడ్డు మార్జిన్ మార్కింగ్ చేస్తున్నామని తెలిపారు. అనంతరం కార్పొరేషన్‌లోని పలు విభాగాల అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షలు నిర్వహించారు.



అర్జీదారుల సమస్య వింటున్న కమిషనర్ నందన్

ఆంధ్ర రంజీ జట్టుకు జిల్లా క్రీడాకారులు

ఒకేసారి నలుగురి ఎంపిక

నెల్లూరు (విద్య), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రంజీ జట్టుకు జిల్లా క్రీడాకారులు ఒకేసారి నలుగురు ఎంపికయ్యారని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, కే శ్రీనివాసులు తెలిపారు. సోమవారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. జిల్లాకు చెందిన కే అశ్విన్‌హెబ్బార్, కే రేవంత్‌రెడ్డి, జే సాకేత్‌రామ్, టీ భరత్ ఆంధ్ర రంజీ జట్టులో చోటు సంపాదించుకోవడం గర్వకారణమన్నారు. ఒక ఏడాదిలో నలుగురు క్రీడాకారులు చోటు దక్కించుకోవడం జిల్లా చరిత్రలో ఇదే తొలిసారి అని, యువ క్రీడాకారులెందరికో ఇది స్ఫూర్తిదాయకమని అన్నారు. రంజీ జట్టుకు ఎంపికై ప్రస్తుతం విజయనగరం జిల్లా క్యాంప్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు పోటీల్లో సత్తా చాటి జిల్లా ప్రతిష్ఠను మరింత ఇనుమడింప జేయాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ జనరల్ మేనేజర్ పీ భానుప్రకాష్‌రెడ్డి, సభ్యులు, క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.



జిల్లా క్రీడాకారులతో హెడ్ కోచ్ గ్యారీ స్టడ్

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

- రిలేదీక్షలకు ఏపీ హంస మద్దతు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాల్సిం దేనని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆరు రోజులుగా వైద్యులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం ఆయన మాట్లాడారు. 20 నుంచి 25 ఏళ్లుగా ఎలాంటి ఉద్యోగోన్నతి లేకుండా వైద్యాధికారులుగానే ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వైద్యులకు టైంబౌండ్ ఉద్యోగోన్నతులు కల్పించాలని, ప్రతీ నియోజకవర్గానికి ఒక సివిల్ సర్జన్, ప్రతి నాలుగు పీహెచ్‌సీలకు ఒక డిప్యూటీ సివిల్ సర్జన్, లేదంటే డిప్యూటీ డీఎంహెచ్‌వో గా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాలలో పనిచేస్తున్న వైద్యులకు 50 శాతం మూల వేతనంతోపాటు నోషనల్ ఇంక్రిమెంట్‌లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసులు, కోశాధికారి డాక్టర్ రవీంద్ర, జేఏసీ నాయకులు, ఏపీ హంస జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్‌కిరణ్, కోశాధికారి శేషగిరిరావు పాల్గొన్నారు.

జనసైనికుల కుటుంబాలకు ఆర్థిక సాయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పెన్నానదిలో ఈతకెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందిన జనసైనికుల కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ నాయకులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ మండలం దేవరపాలెం గ్రామానికి చెందిన కోటయ్య, నరసింహులు జొన్నవాడ వద్ద పెన్నానదిలో ఈతకెళ్లి ప్రమాదదశాత్తు నీటిలో మునిగి మృతి చెందారని చెప్పారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. వారి కుటుంబాలకు జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, సుందర రామిరెడ్డి, గునుకుల కిషోర్, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు దోచేశారు!

(5వ పేజీ తరువాయి)

దానిని క్లిక్ చేసిన వెంటనే ఆమెకు వాట్సాప్‌నకు పార్ట్ టైమ్ జాబ్‌లు అందుబాటులో ఉన్నాయని మెసేజ్‌లు వచ్చాయి. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు కొన్ని టాస్క్‌లు ఇవ్వడంతోపాటు నగదు చెల్లించాలని సూచించారు. వారి మాటలు నమ్మిన యాఫియా పలు దఫాలుగా రూ.7.20 లక్షలు చెల్లించింది. అయితే, ఉద్యోగం రాకపోవడంతో పలుమార్లు సదరు కంపెనీని సంప్రదించేందుకు ప్రయత్నించినా కుదరలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వాంగ సుందరంగా పొదలకూరు రోడ్డు

- మాజీ సైనికుడితో ప్రారంభింపజేసిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



మాజీ సైనికుడు శ్యాంప్రసాద్‌తో కలిసి శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, నాయకులు

నెల్లూరు సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పొదలకూరు రోడ్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. రూ.11 కోట్లతో ఆధునీకరించిన ఆ రోడ్డు పనులను భారత వాయుసేన మాజీ వింగ్ కమాండర్ వల్లూరు శ్యాంప్రసాద్‌తో సోమవారం ప్రారంభింపచేశారు. దేశ రక్షణలో కీలక భూమిక పోషించిన ఓ మాజీ సైనికుడితో ఆధునీకరించిన రోడ్డు పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందని చెప్పారు. బట్వాడిపాళెం నుంచి డైకస్‌రోడ్డు వరకు రూ.11 కోట్లు ఖర్చు చేసి సీసీరోడ్డు, డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్, డ్రైన్లు, గ్రీనరీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ, బీజేపీ నేత వంశీధర్‌రెడ్డి, జనసేన నేత చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న నిర్లక్ష్యం



అధికారుల నిర్లక్ష్యం కారణంగా తూర్పుబోయమడగలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. వరికుంటపాడుకు వెళ్లే లింకు రోడ్డు ప్రాంతంలోని సింగిల్, త్రిఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో విద్యుత్ స్తంభాలకు ఏపుగా పెరిగిన కంపచెట్లు అల్లుకుపోయాయి. దీంతో గాలి వీచినా, వర్షాలు కురిసిన సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. కనీసం అటువైపు వెళ్లే పరిస్థితి కూడా లేకపోవడంతో మరమ్మతులు చేసేందుకు కూడా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-వరికుంటపాడు (ఉదయగిరి రూరల్,ఆంధ్రజ్యోతి)

ఇలాగైతే ప్రమాదాలు జరగవా!?

● రహదారి పక్కనే విద్యుత్ స్తంభాలు ● ప్రమాదాల బారిన వాహనదారులు



గ్రామాల్లో నిరంతరంగా త్రిఫేజ్ విద్యుత్ సరఫరాను కొనసాగించాలనే తలంపుతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసి మిగిలిన వాటిని రహదారి పక్కనే వదిలేయడంతో ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి మండలం గండిపాళెం, గంగిరెడ్డిపల్లి, వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి, తోటలచెరువుపల్లి, తిమ్మారెడ్డిపల్లి తదితర గ్రామాల సమీపంలో రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలను నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ఎదురుగా వాహనాలు వచ్చిన సమయంలో ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని, పగలు ఎలాగోలా ప్రయాణాలు సాగించినప్పటికీ రాత్రి వేళల్లో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాల బారిన పడుతున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి.

-ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)

సచివాలయ పనులు సాగేదెన్నడో..?



అసంపూర్తిగా నిలిచిన సచివాలయ పనులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన సచివాలయ భవనాల పనులు నత్తతో పోటీ పడుతూనే ఉన్నాయి. మండలంలోని విరువూరులో చేపట్టిన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచి ఏళ్ల తరబడి వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఆ భవనానికిరూ. 40లక్షల నిధులు మంజూరవడంతో అప్పట్లో పార్టీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి పనులు చేపట్టారు. అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో పనులు నిలిచిపోయినట్లు సమాచారం. దీంతో మిగిలిన సగభాగం పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. అధికారులు సైతం మనకెందులే అంటూ పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం ఆ భవనం యాచకులు, మందుబాబులకు అడ్డాగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పనులు సాగేలా చూడాలి.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు (విద్య), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) అండర్-19కు సంబంధించి పలు క్రీడల్లో క్రీడాకారుల ఎంపికలకు షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా కార్యదర్శి పాటూరు వేణుగోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎంపికలు మంగళవారం నుంచి జరుగుతాయని తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం ఉదయం 9 గంటలకు అథ్లెటిక్స్, బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఖోఖో, 9వతేదీ ఉదయం 9 గంటలకు బేస్‌బాల్, మధ్యాహ్నం 3 గంటలకు కబడ్డీ, 10వతేదీ ఉదయం 9 గంటలకు సాఫ్ట్ బాల్, మధ్యాహ్నం 3 గంటలకు వాలీబాల్, హాకీ ఎంపికలుంటాయని తెలిపారు. 11వతేదీ మధ్యాహ్నం 3 గంటలకు హ్యాండ్‌బాల్, 12వతేదీ ఉదయం 10 గంటలకు షటిల్ బ్యాడ్మింటన్, 13వతేదీ ఉదయం 10 గంటలకు క్రికెట్ ఎం పికలుంటాయని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఇంటర్ చదువుతూ 2007 జనవరి 1వతేదీ తరువాత జన్మించి ఉండాలని తెలిపారు.

● రేపటి నుంచి మండల స్థాయి ఎంపికలు

ఎస్‌జీఎఫ్ అండర్-17, 14 మండల స్థాయి క్రీడా జట్ల ఎంపికలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు మండల ఇన్‌చార్జి అరిగెల విజయ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం కబడ్డీ, చెస్, యోగా పోటీలు, 9వతేదీన ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, 10వతేదీన జడ్పీ పాఠశాలలో ఖోఖో, వాలీబాల్ ఎంపికలుంటాయని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత తేదీల్లో హాజరు కావాలని కోరారు.

సీజేపై దాడి అమానుషం

● సీనియర్ న్యాయవాది బద్దేపూడి

నెల్లూరు సిటీ, అక్టోబరు 6,(ఆంధ్రజ్యోతి) : భారత అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి(సీజే) భూషణ రామకృష్ణ గవాయిపై న్యాయవాది దాడికి పాల్పడటం అమానుషమని సీనియర్ న్యాయవాది, ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దేపూడి రవీంద్ర అన్నారు. సోమవారం బుజబుజ నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీజేపై న్యాయవాది ఆటవికంగా వ్యవహరించడం సిగ్గుచేటని, అతనిపై చర్యలు తీసుకోవడమేకాక న్యాయవాద వృత్తి నుంచి బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.



జీఎస్టీ తగ్గింపు..

సాగుకు ఊతం

● నూతన విధానంతో మైక్రో ఇరిగేషన్‌కు ప్రోత్సాహం

పొదలకూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : బిందు, తుంపర సేద్యం చేస్తున్న రైతులకు ఇప్పటికే ప్రభుత్వం రాయితీపై పరికరాలు అందచేస్తున్నది. జీఎస్టీ తగ్గడంతో ఈ పరికరాలు మరింత సులభంగా లభించనున్నాయి. ఇన్నాళ్లా డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలపై 12 శాతం జీఎస్టీ ఉండేది. ఇప్పుడిది ఐదు శాతానికి తగ్గింది. బిందు, తుంపర సేద్యాల సాగు వైపు అన్నదాతలను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ఆ ఐదు శాతాన్ని సగానికి తగ్గించింది. ఈ తరహా సేద్యాల పరికరాలపై ప్రభుత్వాలు జీఎస్టీని తగ్గించడంతో ఉద్యాన రైతులకు ఉపశమనం కలిగింది. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంతో సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం లభించింది. కేంద్ర పన్నులకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిన మరో రెండున్నర శాతం రైతులకు మరింత ఊతమిచ్చింది. పరికరాల ధరలు తగ్గడంతో బిందు, తుంపర విధానంలో సాగు చేసే రైతులకు ఊరట లభించింది. దీంతో వారు సూక్ష్మ సేద్యం సాగు వైపు దృష్టి మళ్లే అవకాశముంది. అదే జరిగితే సాగునీటి వృధా అరికట్టవచ్చని ఉద్యాన శాఖాధికారులు అంటున్నారు.

జీఎస్టీ తగ్గిన తర్వాత స్ప్రింక్లర్ల ధరలు .. (రూ.లో)

	30 పైపులు		41 పైపులు	
సైజు	తగ్గకముందు	ప్రస్తుతం	తగ్గకముందు	ప్రస్తుతం
63 ఎంఎం	12.591	11,523	17,875	16,359
73 ఎంఎం	14,216	13,010	20,098	18,393
90 ఎంఎం	19,436	17,787	26,971	24,684
110 ఎంఎం	38,308	35,059	53,136	48,629

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● కలెక్టరు హిమాన్షు శుక్లా

నెల్లూరు(వ్యవసాయం),అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, యూరియా అక్రమ నిల్వలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అంతర్గత తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని గోదాములు, డీలర్ల దుకాణాలు, ఇతర ప్రదేశాల్లో నిల్వ చేసిన ఎరువులు, రికార్డులను క్రమ పద్ధతిలో పరిశీలించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతాంగానికి అవసరమైన ఎరువులను సమయానికి అందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. ఎరువుల అనధికార విక్రయాలు, నకిలీ విత్తనాలు, అనుమతులు లేని పురుగు మందుల విక్రయాలు, అధిక ధరలకు విక్రయించడం తదితర అవకతవకలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. లైసెన్సులు రద్దు చేయడంతోపాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టరు హెచ్చరించారు. వీటిపై ఫిర్యాదులు చేయాలంటే ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరు 83310 57 285ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైనా ఈ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

రాళ్లపాడులో మృతదేహం వెలికితీత



రాళ్లపాడు ప్రాజెక్టులో మృతదేహాన్ని బయటకు తీసుకు వస్తున్న ఎస్‌ఐ నారాయణ, గజ ఈతగాళ్లు

లింగసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో ఆదివారం రాత్రి గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం ఉదయం పోలీసులు బయటకు తీయించారు. ఎస్‌ఐ ఎం.నారాయణ, కొందరు గజ ఈతగాళ్లు పడవలో ప్రాజెక్టు గేట్ల వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తెచ్చారు. సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగిన మృతుడు గుండు గీయించుకొని ఉన్నాడు. మృతదేహాన్ని కందుకూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు 9121102217 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని ఎస్‌ఐ కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై రేపు అవగాహన సదస్సు



విలేకరులతో మాట్లాడుతున్న ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సేల్స్ టాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పేరుతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ యాలమూరి రంగయ్య నాయుడు, వైస్ చైర్మన్ డాక్టర్ ఏవీఎస్ కృష్ణమోహన్‌రావు, ఈసీ మెంబరు ఎస్వీ రమేష్‌బాబు, ఎన్ బలరామయ్య నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డులో ఉన్న పీఎస్ఆర్ కల్యాణ మండపంలో జరుగుతుందని, పారిశ్రామిక, వర్తక, వాణిజ్య వేత్తలు, వినియోగదారులు విజయవంతం చేయాలని కోరారు. సోమవారం జర్నలిస్టు భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. సదస్సుకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ వై కిరణ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ ఎం సత్యప్రకాష్ హాజరవుతారని చెప్పారు. తగ్గించిన జీఎస్టీ రాయతీలు ప్రజలందరికీ అందించేలా కృషి చేస్తామని తెలిపారు.

లీకేజీ నీటితో ఇక్కట్లు

● తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి స్టేషన్ పైపులైన్ నీరు

● రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు, ప్రజలు

కావలి,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా... ఎవరికైనా సమస్య ఇస్తే... పరిష్కారం కోసం పోలీసుల వద్దకు వెళ్లతాం. కానీ పోలీసుల వల్లే ఇబ్బందులు ఎదురైతే ఎవరి వద్దకు వెళ్లాలి...? ఇలాంటి సమస్యే రెవెన్యూ అధికారులు, పోలీసుల మధ్య ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి పైపులైన్ లీకై తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి నీరు వస్తోంది. పైపులైన్‌లు లీక్ కావటం సహజమే కానీ.. దాన్ని మరమ్మతులు చేసుకోవాల్సి ఉన్నా, పోలీసులు పట్టించుకోవడంలేదు. సుమారు నెల రోజులుగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి పోలీస్‌స్టేషన్ నుంచి నీరు వస్తూ ఆవరణమంతా మురుగునీటి మడుగుగా తయారైంది.



నీటి మడుగుతో రాకపోకలకు అడ్డుగా పెట్టిన దుంగలు

ఒక్క తహసీల్దార్ కార్యాలయమే కాకుండా సబ్‌రిజిస్ట్రార్, వ్యవసాయశాఖ కార్యాలయాల అధికారులు, సిబ్బంది, ఆయా కార్యాలయాలకు రాకపోకలు సాగించే ప్రజలు సైతం ఆ మురుగునీటిని తొక్కుకుంటూ వెళ్లాల్సిందే. ప్రజలకు ఎంతో ఇబ్బంది కరంగా మురుగునీటి మడుగు ఉన్నా అధికారులు పట్టించుకోవటంలేదు, మురుగునీరు తహసీల్దార్ కార్యాలయంలో ఉండటంతో అందరూ రెవెన్యూ అధికారులను మురుగునీరు అలా ఉంటే రాకపోకలు ఎలా సాగించాలని అడుగుతున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆ నీరు పోలీస్‌స్టేషన్ నుంచి వస్తున్నాయని ఎక్కడో పైపులైన్ లీక్ అయినట్లు ఉందని వారికి చెప్పినా స్పందించటంలేదని చెబుతున్నారు. తామే మరమ్మతులు చేద్దామంటే ఆ పైపులైన్ లీక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉందంటున్నారు. సమాజంలో ప్రజాదరణలో ఉన్న పోలీస్, రెవెన్యూశాఖలే నీటి మడుగు సమస్యను పరిష్కరించకపోతే ప్రజలకు, ఉద్యోగులకు విముక్తి ఎలా కలుగుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్ లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.




తహసీల్దార్ కార్యాలయం ముందు ఏర్పడిన మురుగునీటి మడుగు, పోలీస్ స్టేషన్ గోడలో నుంచి వస్తున్న నీరు

ఫిర్యాదులపై విచారణ జరిపి, న్యాయం చేస్తాం : ఎస్పీ



దివ్యాంగుడి వద్దకు వచ్చి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసు పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి, న్యాయం చేస్తామని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 121 మంది బాధితులు తరలివచ్చి ఎస్పీకి ఫిర్యాదులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించి అర్జీలను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌజన్య, నగర డీఎస్పీ సింధుప్రియ, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు క్రికెట్‌లో సెమీస్‌కు జిల్లా జట్టు



సెమీస్‌కు చేరుకున్న నెల్లూరు జట్టు

నెల్లూరు (విద్య), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో జరుగుతున్న జేశాప్ జర్నలిస్ట్‌ల రాష్ట్ర క్రికెట్ పోటీల్లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు కర్నూలు జట్టుపై విజయం సాధించి సెమీఫైనల్స్ కు చేరుకుంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 95 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 68 పరుగులు మాత్రమే చేయడంతో 27 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించిందని జేశాప్ రాష్ట్ర కార్యదర్శి నరేష్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు నందకిషోర్, సునీల్ తెలిపారు.

'ఉపాధి' అవినీతిపై పునర్విచారణకు ఆదేశాలు

కలువాయి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగోపవరం పంచాయతీలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అవినీతి వ్యవహారంపై షెడ్యూలు కులాల జాతీయ కమిషన్ ఆదేశాల మేరకు పునర్ విచారణ చేసి 15 రోజుల్లో నివేదిక అందించాలని జిల్లా ఎస్పీ, డ్వామా పీడీ, జిల్లా పంచాయతీ అధికారులకు కలెక్టర్ సోమవారం ఆదేశాలు ఇచ్చారు. చిన్నగోపరంలో ఎస్సీ, ఎస్టీ, ఇతరుల ఉపాధి జాబ్‌కార్డుల్లో గ్రామానికి సంబంధం లేని పలువురు పేర్లు చేర్పించి, ఉపాధి నిధులను భారీగా స్వాహా చేశారు. దీనిపై గతంలో విచారణ జరిపారు. ఈ విచారణలో దోషులుగా తేలడంతో ఉపాధి హామీ పథకంలో పనిచేసే పలువురిని ఉద్యోగాల నుంచి తొలగించారు. వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. ఈ వ్యవహారంపై తాజాగా కొందరు షెడ్యూలు కులాల జాతీయ కమిషన్ (హైదరాబాదు)కు ఫిర్యాదు చేయడంతో పునర్ విచారణకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు.

బ్రాహ్మణక్రాక పంచాయతీ విభజనపై గ్రామసభ



గ్రామసభకు హాజరైన బ్రాహ్మణక్రాక పంచాయతీ ప్రజలు

జలదంకి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని మేజర్ పంచాయతీ బ్రాహ్మణక్రాక విభజనపై సోమవారం పంచాయతీ కార్యదర్శి నీరజ గ్రామసభ నిర్వహించారు. బ్రాహ్మణక్రాక-1 సచివాలయ ప్రాంగణంలో సర్పంచు ఇండ్ల సుధాకర్ అధ్యక్షతన జరిగిన గ్రామసభకు వార్డుసభ్యులు, పంచాయతీలోని బీకే అగ్రహారం, హనుమకొండపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు తమకు ప్రత్యేకంగా పంచాయతీ కావాలని ఆకాంక్షించారు. వీరి కోరికల మేరకు డీఎల్‌పీవో, ఈవోపీఆర్‌డీలకు గ్రామసభ తీర్మానాలకు నివేదిస్తామని కార్యదర్శి నీరజ తెలిపారు. కాగా బీకే అగ్రహారంను పంచాయతీ చేసే విషయమై ఆ గ్రామస్థులు, వార్డుసభ్యులు ఒక్కటిగా ఉండగా హనుమకొండపాలెం విషయంలో అక్కడి ప్రజల మధ్య భిన్న అభిప్రాయాలు గ్రామసభలో వ్యక్తమయ్యాయి. గ్రామసభలో ఉపసర్పంచు దగుమాటి మాల్యాద్రిరెడ్డి, టీడీపీ, బీజేపీ నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి, పున్నం రోశిరెడ్డి, లింగంగుంట కృష్ణయ్యనాయుడు, స్వర్ణ కొండపనాయుడు, కంచర్ల వెంకప్పనాయుడు, కంచర్ల మురళీనాయుడు, మారెళ్ల బ్రహ్మారెడ్డి, వంటేరు రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వాల్మీకి జయంతి

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలతో మంగళవారం ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్ తిక్కనభవన్‌లో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించాలి : కలెక్టర్



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అర్జీదారులు సంతృప్తి చెందేలా ప్రతి సమస్యను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఏశాఖ పరిధిలో కూడా అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని ఆదేశించారు. ప్రతిరోజూ తమ లాగిన్‌లలలో అర్జీల స్టేటస్ పరిశీలించి, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. భూసమస్యలు ఇతర రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. వాటిని పరిష్కరించే దిశగా అధికారులు శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేక పోతున్నామో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. అందిన వినతుల్లో కొన్ని...

● గొలగమూడి వెంకయ్య స్వామి ఆశ్రమాన్ని కాపాడుతున్న ఈవో బాలసుబ్రహ్మణ్యంకు ప్రభుత్వం అండగా నిలవాలని బీజేపీ నేత మిడతల రమేష్, జిల్లా అభివృద్ధి సంస్థ సభ్యుడు పోట్లూరు శ్రీనివాసులు, వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి ఏవీఆర్ మోహన్‌రావు, ఏపీ తీరప్రాంత మత్స్యకార పరిరక్షణ సమితి ఫౌండర్ చిట్టిబాబు, జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడు నారాయణ యాదవ్, కోవూరు బీజేపీ నేత సోమగోపాల్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈవోపై ఆరోపణలు చేయటం సరికాదని, ప్రభుత్వం ఆయనకు అండగా నిలవాలని కోరారు.

● దగదర్తి మండలం ఉలవపాళ్లలో మాదిగలకు ఇచ్చిన భూములకు పట్టా ఉన్నా, లేకపోయినా అందరికీ ఇచ్చినట్లుగా పరిహారం సమానంగా ఇవ్వాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ జేసీకి వినతిపత్రం అందచేశారు.

● నెల్లూరు ఐటీడీఏ కార్యాలయంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, జిల్లా అధ్యక్షుడు మానికల మురళీ కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు.

● దివ్యాంగుల కోసం ప్రత్యేక పీజీఆర్ఎస్‌ను ఏర్పాటుచేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

● కాకుటూరు పంచాయతీలో ఉన్న రఘువీర్ రియల్ ఎస్టేట్ స్థలాలను కాపాడాలని ఆ లేఅవుట్ స్థల యజమానులు కృష్ణారెడ్డి, రవికుమార్, మనోహర్, ఆదిశేషయ్య కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు.

● నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : గొలగమూడి ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యంకు అండగా చేనేత పద్మశాలి సంఘం ఉంటుందని సోమవారం పద్మశాలి సంఘం అధ్యక్షుడు బుధవరపు బాలాజీ కలెక్టర్ పీఏకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ సోమగోపాల్, ఉపాధ్యక్షుడు కొప్పర్తి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ పీఏకి వినతిపత్రం అందచేస్తున్న చేనేత సంఘం నాయకులు

రేపు రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

ఉదయగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మురళి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎల్ రామ్మోహన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11423
వెండి కిలో ధర	రూ. 156900
వెండి ఒక గ్రాము	రూ. 160.90

న్యూస్ బాక్స్

వడ్డే ఓబన్నకు ఘన నివాళి


ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉదయగిరి, అక్టోబు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న వర్ధంతి కార్యక్రమం ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా నాయకుడు బత్తుల నాగరాజు, నాయకులు తిరుపతి, పెంచలరాజు, లక్ష్మమ్మ, రమణయ్య, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

ఆత్మకూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్లవీడు గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో మంగళవారం నుంచి ఐదురోజుల పాటు కుంభాభిషేక మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పతిరోజు భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

మర్రిపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వీఆర్ఏలు సోమవారం మర్రిపాడు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 13, 14 తేదీలలో మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు, 15న విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలంలోని విఆర్ఏలు అందరూ కలిసి వెళ్లనున్నట్లు వారు తెలిపారు.

లే అవుట్ కాలనీలో నీటిసమస్యను పరిష్కరించాలి

అనంతసాగరం అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం వెనుక లేఅవుట్ కాలనీలో నీటిసమస్య పరిష్కరించాలంటూ కాలనీవాసులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. కాలనీలో నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని సిబ్బందికి వినతిపత్రం అందచేశారు.

కదిరినేనిపల్లిని విడగొట్టొద్దు

- అంబేడ్కర్ విగ్రహానికి వినతి


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కదిరినేనిపల్లి వాసులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మర్రిపాడు మండలంలోని కదిరినేనిపల్లిని చిన్న మాచనూరు పంచాయతీ నుంచి విడగొట్టొద్దని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈమేరకు సోమవారం నెల్లూరులో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. స్థానిక ఎంపీటీసీ బాలగురవయ్య, ఓ బాలకృష్ణారెడ్డి తదితరులు మాట్లాడుతూ తమ గ్రామంలో వెయ్యి మందికిపైగా జనాభా ఉన్నారని, బ్రిటీష్ కాలం నుంచి చిన్న మాచనూరు పంచాయతీలో భాగంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేస్తున్నారని, చిన్నమాచనూరు పంచాయతీలోనే కొనసాగించాలని కోరారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 862 బేళ్లను తీసుకొని రాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 615 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 247 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ.315 కాగా, కనిష్ఠ ధర రూ.70 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు, టైలు అందజేత

ఉదయగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక విశ్రాంత ఉపాధ్యాయుడు కటారి వెంకటరత్నం తమ సొంత నిధులతో ఐడీ కార్డులు, టైలు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చినుకు రాలితే చిత్తడే

- బురదమయంగా ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు
- ప్రజలు, ఉద్యోగుల అవస్థలు


తహసీల్దారు కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు


బురదమయంగా సబ్‌ట్రెజరీ కార్యాలయం రహదారి

ఉదయగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే చాలు పట్టణంలో ప్రధాన కార్యాలయాల పరిసరాలు బురదమయంగా మారుతుండడంతో ప్రజలు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల ముందు చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు చేరి బురదమయంగా మారి రొచ్చురొచ్చుగా ఉండడం, రోజుల తరబడి వర్షపు నిల్వ ఉండడంతో పలు పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ఉద్యోగులు అడుసు తొక్కందే కార్యాలయానికి వెళ్లే పరిస్థితి లేదు. మండలస్థాయి అధికారులు అందులో రాకపోకలు సాగించడం, నిత్యం ప్రజల అవస్థలు చూస్తున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాల పరిసరాలలో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


ఉదయగిరి: ఆటల పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దారు, ఎంఈవో


చేజర్ల : ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

ఉదయగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తహసీల్దారు ఎల్ రామ్మోహన్ సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఎంఈవో-1 టీ వెంకటేశ్వర్లుతో కలిసి మండలస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17 పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలగడంతోపాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఉద్యోగ అవకాశాల్లో తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలకు వెళ్లవచ్చన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జీ శ్రీనివాసులు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి డీవీవీ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు ఖాజారియాజ్, నయూమ్, తబిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

●చేజర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, బాడ్మింటన్, యోగ, అథ్లెటిక్స్‌లలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు ఆత్మకూరులో డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయయులు శ్రీనివాసులరెడ్డి, గురువయ్య, సురేష్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఈవో1 నిర్మల, ఎమ్ఈవో 2 మస్తానయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రావణ్, శివరామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు కలువాయిలో...

●కలువాయి: మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో పి పద్మనాభం తెలిపారు. అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మిటన్, యోగా, చదరంగం క్రీడల్లో ఈపోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరిచిన వారిని డివిజన్ స్థాయిలో జరుగు పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు ఎస్.రాజా(పీఈటీ) 9949265047 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

9, 10 తేదీల్లో వింజమూరులో...

వింజమూరు: మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 9, 10వ తేదీలలో నిర్వహించనున్నట్లు విద్యాశాఖాధికారి రమేష్ తెలిపారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులు కావలి డివిజన్ స్థాయిలో పాల్గొంటారని తెలిపారు.

స్వచ్ఛ గ్రామ పంచాయతీగా కరటంపాడు


కలెక్టరు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కార్యదర్శి షేక్ షఫీ

ఆత్మకూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరటంపాడు పంచాయతీ స్వచ్ఛ ఆంధ్ర గ్రామ పంచాయతీగా ఎంపికైన సందర్భంగా పంచాయతీ కార్యదర్శి షేక్ షఫీ జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా చేతుల మీదుగా నెలూరులో సోమవారం అవార్డు అందుకున్నారు. దీంతో సర్పంచ్, కార్యదర్శికి గ్రామప్రజలు అభినందనలు తెలిపారు.

సంగం పంచాయతీకి స్వచ్ఛ అవార్డు


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచి, కార్యదర్శి

సంగం, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి): స్వచ్ఛ అవార్డుకు సంగం పంచాయతీ ఎంపికైంది. ఈమేరకు సోమవారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సర్పంచ్ నిమ్మళ్ల రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి ఆర్ నరసయ్యకు అవార్డు ప్రదానం చేశారు. దీంతో మండల అధికారులు కార్యదర్శిని అభినందించారు.

స్వచ్ఛ అవార్డుకు రేవూరు హాస్టల్ ఎంపిక

- వార్డెన్ మల్లేశ్వరికి ప్రశంసాపత్రం అందజేత


కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న వార్డెన్

అనంతసాగరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరు బీసీ బాలికల వసతిగృహాన్ని స్వచ్ఛాంధ్ర అవార్డుకు జిల్లా అధికారులు ఎంపిక చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రేవూరు వార్డెన్ మల్లేశ్వరీ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్‌తో పాటు జడ్పీ చెర్మన్ ఆనం అరుణమ్మ, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తదితరులు వార్డెన్‌ను అభినందించారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలభిషేకం


కార్యక్రమంలో పాల్గొన్న ఆటోడ్రైవర్లు, నాయకులు

అనంతసాగరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిలలో సోమవారం ఆటోవాలాలు కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం రూ. 15వేలు అందచేయడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శాఖమూరి సుబ్బారావు, ఉప్పల విజయ్‌కుమార్, పోకల శ్రీనివాసులురెడ్డి, కృష్ణ, రహమాన్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాల పంపిణీ

ఉదయగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యావనరుల కేంద్రంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు రెండవ సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మొత్తం 9,530 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. వాటిని పంపిణీ చేయడం జరిగిందన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : ఏపీడీ


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ మృదుల

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ మృదుల అన్నారు. సోమవారం స్థానిక ఉపాధిహామి పథకం కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రభుత్వం నిర్దేశించిన మేరకు లక్ష్యాలు సాధించాలన్నారు. శ్రామికుల సంఖ్య పెంచడంతో పాటు జాబ్ కార్డులను ఈకెవైసీ చేయించాలన్నారు. అలాగే ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించి గిట్టుబాటు నగదు అందేలా చూడాలన్నారు. మండలంలోని 124 ఎకరాలకు మంజూరైన ఉద్యాన పంటల సాగు పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అలాంటి రైతులు తమ పొలాల్లో ఫారంపాండ్ గుంతలు తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న సిబ్బంది పద్ధతి మార్చుకోకపోతే విషయాన్ని శాసన సభ్యుడు కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టేందుకు సిఫార్సు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించి పంచాయతీల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణారెడ్డి, ఏపీవో ఆజంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు బైపాస్ రోడ్డు పనులు వేగవంతం


బైపాస్‌రోడ్డుకు ఇరువైపులా తోలిన గ్రావెల్

ఆత్మకూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని హనుమాన్ జంక్షన్ వద్ద నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి నుంచి ఆత్మకూరు పట్టణంలోకి చేపట్టిన బైపాస్‌రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బైపాస్ నిర్మాణానికి రూ.6.31 కోట్లు మంజూరు చేయించారు. దీంతో అధికారులు పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగించి సర్వేచేసి రోడ్డు హద్దు వరకు రాళ్లు వేశారు. రోడ్డుకు ఇరువైపుల గ్రావెట్ తోలి చదును చేశారు. బైపాస్ రహదారికి సెంటర్ డివైడర్, లైటింగ్, వాకింగ్ ట్రాక్‌కు మార్జిన్ ఉండేలా నిర్మాణం చేపట్టనున్నారు. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఆత్మకూరు నుంచి నెల్లూరుకు వెళ్లే వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని హర్షం వ్యక్తమవుతోంది.

ఉదయగిరిలో ట్రాఫిక్ సమస్యతో ప్రజల అవస్థలు


రోడ్డుపై కారు పార్కింగ్ చేయడంతో స్తంభించిన ట్రాఫిక్

ఉదయగిరి, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి): అసలే ఇరుకు రహదారులు.. ఆపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సోమవారం ఓ వ్యక్తి స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై అడ్డదిడ్డంగా కారు పార్కింగ్ చేసి వెళ్లిపోయాడు. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. సుమారు అర్థగంట పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని కారు డ్రైవర్‌ను మందలించి జరిమానా విధించారు. అనంతరం కారును తొలగించి వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు.

జీఎస్టీ తగ్గింపుపై అధికారుల అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న అధికారులు, నాయకులు, విద్యార్థులు

కలువాయి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగింపుపై సోమవారం కలువాయిలో అధికారులు, నాయకులు, విద్యార్థులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో మనవ హారంగా ఏర్పడి ప్రజలను చైతన్యవంతం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయని ఎంపీడీవో శైలజ తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లా రఘురామిరెడ్డి, జీ వెంకటేశ్వర్లు నాయడు, గడ్డం కిషోర్‌రెడ్డి, జగదల్ నాయుడు, బీజేపీ నాయకలు డి పెంచలయ్య, వ్యవసాయాధికారి చల్లా కళారాణి, హెచ్ఎం అబ్బాస్ ఆలీ, పెంచల పుల్లయ్య, పి సునీల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ప్రైవేటు ట్రావెల్స్‌పై కొరడా

- 115 ప్రైవేటు బస్సులపై కేసుల నమోదు
- స్వయంగా తనిఖీలు చేపట్టిన డీటీసీ


తనిఖీలు చేపడుతున్న డీటీసీ చందర్

వెంకటాచలం, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి) : దసరా పండుగ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖాధికారులు కొరడా ఝుళిపించారు. వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి డీటీసీ బీ చందర్ స్వయంగా ఆర్టీఏ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధిక చార్జీలు వసూలు చేసిన 105 బస్సులు, ఓవర్ లోడ్ 9, సరైన పత్రాలు లేని ఒక బస్సు. మొత్తం 115 ప్రైవేటు ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు చేశారు. దీంతో రూ.11.41 లక్షల అపరాధ రుసుమును విధించారు. దసరా పండుగకు వచ్చి తిరిగి వారి స్వస్థలాలకు భారీ సంఖ్యలో వెళ్తున్న ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్‌పై ఉక్కుపాదం మోపారు. ఒకేసారి 115 ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. డీటీసీ చందర్ మాట్లాడుతూ దసరాకి సొంత ఊళ్లకు వచ్చి వెళ్లే వారి దగ్గరి నుంచి భారీగా ప్రైవేటు ట్రావెల్స్ వారు రవాణా చార్జీలు వసూలు చేస్తున్నట్లు రవాణా శాఖ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తం గా తనిఖీలు చేపట్టారన్నారు. నిబంధనలు అతిక్రమించి అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో తనిఖీలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో బ్రేక్ ఇన్స్పెక్టర్లు మురళీమోహన్, షఫీ, ఆర్టీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బిట్రగుంట/కావలిరూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం సున్నపుబట్టీ సమీపం లో జాతీయ రహదారిపై మోటారు బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో కావలి పట్టణం ఇందిరానగర్‌కి చెందిన షేక్ అహ్మద్(30) మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. కావలి నుంచి బేల్దారి పనులకు నెల్లూరుకు వెళ్లిన అహ్మద్ తిరిగి మోటారు బైక్‌పై కావలి వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు దగదర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● సాదావానిపాలెం వద్ద వ్యక్తి...

నెల్లూరు రూరల్ : నెల్లూరు రూరల్లోని సాదావారిపాళెం వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. 40-45 ఏళ్ల మధ్య వయస్కుడు మరణించాడు. మద్యం తాగి స్పృహ కోల్పోయి మరణించి ఉండవచ్చని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం అందాల్సి ఉంది.

● గుర్తుతెలియని వ్యక్తి ...

కలిగిరి: మండలంలోని వెలగపాడు సచివాలయం ముందున్న బస్ షెల్టర్‌లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉండవచ్చుని, చొక్కా కాలర్‌పై పవన్ మెన్స్‌వేర్ పామూరు అని ఉంది. వివరాలు తెలిసినవారు తమకు సమాచారం అందించాలని ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

పెన్నాలో గల్లంతైన కోటయ్య దుర్మరణం


కోటయ్య (ఫైల్)

నెల్లూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడ రేవు వద్ద పెన్నా నదిలో ఈతకెళ్లి గల్లంతైన కోటయ్య(24) మృత్యువాత పడ్డాడు. అతని మృతదేహాన్ని గజఈతగాళ్లు సోమవారం గుర్తించి బయటకు తీసుకువచ్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రూరల్ పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. కాగా, ఆదివారం నలుగురు యువకులు ఈ ప్రాంతంలో ఈతకెళ్లగా ముగ్గురు నీట మునిగిన విషయం విదితమే. వారిలో ఒకరి ప్రాణాలతో బయటపడగా నరసింహ (19) అనే యువకుడి మృతదేహాన్ని ఆదివారమే గుర్తించారు. పెన్నా నది నీటిలో గల్లంతైన కోటయ్య సోమవారం వెలికి తీశారు. వీరిద్దరి మరణంతో వారి స్వగ్రామమైన దేవరపాళెంలో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నం టాయి. బాధిత కుటుంబాలను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరామర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గుంజి వేణు తెలిపారు.

మల్లికార్జున్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

వెంకటాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెముడుగుంట పంచాయతీ జిల్లా జైలుకెళ్లే మార్గంలో ఇటీవల జరిగిన హత్య కేసు మిస్టరీని పోలీసులు సాంకేతిక ఆధారంతో ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గత నెల 30వ తేదీన బుజబుజ నెల్లూరు పరిధిలోని న్యూకాలనీకి చెందిన వల్లూరు మల్లికార్జున్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్య బంగారు నగల కోసమే జరిగినట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. సమీప బంధువే ఈ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు న్యూకాలనీలో నివాసం ఉంటున్న వల్లూరు మల్లికార్జున్ గత నెల 29వ తేదీ రాత్రి నుంచి కనిపించలేదు. 30వ తేదీన నక్కలకాలనీ సమీపంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. స్వయంగా జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సంఘటన స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. ఈ హత్య కేసును పోలీసులు చాలెంజ్‌గా తీసుకుని ఆరు రోజుల్లోనే సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఛేదించారు. బుజబుజ నెల్లూరు పరిధిలోని న్యూకాలనీలోనే మల్లికార్జున్ సోదరుడి కుమార్తె భర్త వెలగల పవన్ కళ్యాణ్ నివాసం ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పవన్ కళ్యాణ్ మల్లికార్జున్‌ను నగదు అడగ్గా ఇవ్వకపోవడంతో మల్లికార్జున్‌పై కోపం పెంచుకున్నాడు. దీంతో గత నెల 29వ తేదీన మల్లికార్జున్‌కు మద్యం తాగించాడు. పక్కా ప్రణాళికతో కిరాతకంగా హత్య చేసి మల్లికార్జున్ బంగారు గొలుసు, ఉంగరం లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పోలీసులు పవన్ కళ్యాణే హత్యకు పాల్పడినట్లు గుర్తించారు. తానే హత్య చేసినట్లుగా పవన్ కళ్యాణ్ అంగీకరించాడు. దీంతో అతడిని అరెస్టు చేసి సోమవారం కోర్టుకు హాజరు పరచగా ఈనెల 17 వరకు రిమాండ్ విధించినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బైక్ చోరీపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరులోని సరస్వతి నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు ఈ నెల 4వ తేదీ ఉదయం మూలాపేట అలంకార్ సెంటర్ సమీపంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు వెళ్లారు. బ్యాంకు బయట తన బైక్‌ను పార్క్ చేసి లోపలికి వెళ్లారు. పనిముగించుకొని బయటకు వచ్చిచూడగా వాహనం కనిపించలేదు. చుట్టు పక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో బాధితుడు సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	135
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	266
కోడిగుడ్ల ధర (100): 525	

విశ్రాంత ఉపాధ్యాయులకు ఘన సన్మానం

అల్లూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అల్లూరులోని రామకృష్ణ జూనియర్ కళాశాలలో విశ్రాంత ఉపాధ్యాయులు రామయ్య, పెనుమూడి వెంకటేశ్వర్లును ప్రిన్సిపాల్ వీ.శ్రీనివాసులు, కళాశాల సిబ్బంది సోమవారం శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలకు సేవలందించిన విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించుకోవడం వారి సేవలకు గౌరవం దక్కినట్లే అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధరరావు, చంద్రశేఖర్, వాసు తదితరులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్ల, లింగసముద్రం, చినపవని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగుతుందని విద్యుత్ శాఖ మండల ఏఈ షేక్ ఫిరోజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్లలో ఆర్డీఎస్ఎస్ మెయింటెనెన్స్ పనులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కారణంగా ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

దివ్యాంగుల పింఛను ఇప్పించండి సారూ..

కావలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 16వ వార్డుకు చెందిన గిరిజన సామాజిక వర్గానికి చెందిన దివ్యాంగుడు చెవుడు మాలకొండయ్య తాను తన భార్య ఇద్దరం పక్షవాతంతో నడవలేని పరిస్థితులలో ఇంటికే పరిమితమయ్యామని, మాకు దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలని కోరారు. పీజీఆర్ఎస్ సందర్భంగా సోమవారం ఆయన కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణను కలిసి వినతిపత్రం అందచేశారు. ప్రస్తుతం తనకు వృద్ధాప్య పింఛన్ వస్తోందని, సదరన్‌లో తీసుకున్న దివ్యాంగుల సర్టిఫికెట్ ఉన్నా దివ్యాంగుల పింఛన్‌కు సచివాలయంలో తమ పేరు నమోదు చేయడం లేదన్నారు. అలాగే తన భార్యకు సదరన్ సర్టిఫికెట్ తీసుకునేందుకు సచివాలయానికి వెళ్లితే అక్కడ ఆమె పేరు నమోదు చేసి సదరన్‌కు పంపడం లేదన్నారు. నిరుపేదలైన మాకు దివ్యాంగుల పింఛన్ ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. అలాగే దగదర్తి మండలంకు చెందిన శెట్టిపల్లి రామయ్య తమ భూమిని కుటుంబ సభ్యులు కాజేశారని, తమకు న్యాయం చేసి తమ భూమి తనకు ఇప్పించాలని కోరారు. వీరి వెంట టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు ఉన్నారు.

ప్రతాప్‌రెడ్డి నాయకత్వంలోనే పని చేస్తాం

కావలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నాయకత్వంలోనే మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులం పని చేస్తామని విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు స్పష్టం చేశారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో విష్ణు అనుచరులైన వైసీపీ నాయకులు అనంత బాలకృష్ణంరాజు, గోసల గోపాలరెడ్డి, పాలవల్లి పద్మనాభరెడ్డిలు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిలు ఇద్దరూ ఒకటేనన్నారు. ప్రతాప్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించినప్పుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఫోన్‌చేసి ఆయనతో మాట్లాడి విచారించారన్నారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రతాప్‌రెడ్డితో మాట్లాడిన తర్వాతనే విష్ణువర్ధన్‌రెడ్డిని కేంద్ర కమిటీలో సభ్యుడిగా నియమించారన్నారు.

పోట్లూరు శ్రీనివాసులుకు ఘన సన్మానం

కావలి(టౌన్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఏజీపీ పోట్లూరు శ్రీనివాసులు జన్మదినం పురస్కరించుకుని సోమవారం ఆయన కార్యాలయంలో పలువులు న్యాయవాదులు, సిబ్బంది ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. న్యాయవాదులు పీవీ రాఘవరావు, వై.లూకాస్‌జోసఫ్, వై.కోమలి, ఏ.హరిబాబు, పీ.ఝాన్సీ, సిబ్బంది పీ.విజయ్‌కుమార్, బీ.ప్రసాద్. పీ.రామకృష్ణరాజు, వింజమూరు నరేష్, ఎస్‌కే.ఆరీఫ్ టీడీపీ నాయకులు, తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

బిట్రగుంట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బోగోలు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆధార్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆధార్ కార్డుల్లో తప్పుల సవరణ, చిన్నపిల్లలకు కొత్తగా ఆధార్ నమోదుకు అవకాశం ఉందని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం రెడ్‌క్రాస్‌లో రక్తదానం

కావలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన నాగరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థంగా అతని స్నేహితులు సోమవారం కావలి రెడ్ క్రాస్ రక్తకేంద్రంలో రక్తదానం చేశారు. వారిని రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కే.హరినారప రెడ్డి అభినందించారు. జీ.సాయి గౌతమ్, బాలాజీలను రెడ్‌క్రాస్ నిర్వహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టనూ తవ్వేశారు!

- యథేచ్ఛగా గ్రావెల్ దందా
- అక్రమంగా ప్లాట్లకు తరలింపు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



గ్రావెల్ కోసం తవ్వేసిన రాజుపాలెం పెద్దచెరువు కట్ట

ఉలవపాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అక్రమ గ్రావెల్ దందా ముఠా చెరువు కట్టలను వదలడం లేదు. వర్షాలు సంవృద్ధిగా కురిసి చెరువు నిండితే పరిస్థితి ఏమిటన్న విషయాన్ని విస్మరించి తమ పని జరిగిపోతే చాలన్నట్లు మండలంలోని రాజుపాలెం పెద్ద చెరువు కట్టను రాత్రి సమయాల్లో యంత్రాలతో తవ్వి టిప్పర్లతో అక్రమంగా చెరువుకు దక్షిణం వైపు అటవీ రోడ్డు మార్గానా తరలించారు. ఇక్కడ తవ్విన సుమారు 150 ట్రిప్పుల గ్రావెల్‌ను చాగొల్లు హైవే పక్కన ఉన్న స్థలం మేరువకు తోలినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు గుంతల్లో నీరు నిలిచింది. దీంతో చెరువు కట్ట అంచున గ్రావెల్ తీసేందుకు అనుకువగా ఉండటంతో కొంత దూరం మేరకు కట్టనూ తవ్వేశారు. కాగా ఈ గ్రావెల్ దందాలో అధికార పార్టీ నాయకుల పాత్ర ఉన్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయితే ఐదారు నెలల క్రితం గ్రావెల్ దందాపై ఆరోపణలు రావడంతో పార్టీకి చెడ్డపేరు తేవద్దంటూ స్థానిక ఎమ్మెల్యే సదరు వ్యక్తులను ఘాటుగా హెచ్చరించారు. ఆదమరిచిన ఆ నేతలు మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా రాత్రుల్లో గ్రావెల్ దందా మొదలు పెట్టినట్లు సమాచారం. అక్రమార్కులు గ్రావెల్ కోసం చెరువును గుల్ల చేస్తున్నా మాకేం పట్టలేదన్నట్లు ఇరిగేషన్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. స్థానికులు కొందరు చెరువు కట్టను ధ్వంసం చేస్తున్నారని ఇరిగేషన్ అధికారులకు ఫోన్ల ద్వారా సమాచారం అందించినా, మూడు రోజులుగా అర్ధరాత్రులు గ్రావెల్ తోలుతున్నా పట్టించుకోని ఇరిగేషన్ అధికారుల తీరుపై గ్రామస్థులు మండిపడుతున్నారు.



చాగొల్లు హైవే పక్కన పొలం మేరువకు అక్రమంగా తోలిన గ్రావెల్

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయం

కందుకూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై అత్యున్నత న్యాయస్థానంలోనే సనాతన ధర్మం ముసుగులో కొందరు కుల, మత మౌఢ్య ముఠా న్యాయవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అఖిల భారత మాలసంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. న్యాయవాదులు జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు నిలబడి న్యాయస్థానం పవిత్రతను మంటగలిపేలా అసభ్యంగా ప్రవర్తిస్తూ నినాదాలు చేయడం, ఒక న్యాయవాది ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసరడం చూస్తుంటే భారత రాజ్యాంగానికే పెనుముప్పు పొంచి ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ పెద్దల ప్రోద్బలం లేకుండా న్యాయవాదులు ఇంతటి దుస్సాహసానికి పూనుకోలేరని, ప్రధాన న్యాయమూర్తి దళితుడు కావటం, అన్నిమతాలను గౌరవించే సెక్యులర్‌గా ఉంటానని ఆయన ప్రకటించటమే ఈ దాడికి కారణమని పేర్కొన్నారు. ఆ న్యాయవాదుల ముఠాను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయం



డీటీ జూలియాభాయ్‌కి కూరగాయలు విక్రయిస్తున్న పొదుపు మహిళలు

జలదంకి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో వ్యవసాయశాఖ-రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో పొదుపు మహిళలు సోమవారం సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. పొదుపు మహిళలు సేంద్రియ ఎరువులతో సాగుచేసి పండించిన పలురకాల కూరగాయలు ఉంచి తహసీల్దారు కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు హాజరైన ప్రజలకు విక్రయించారు. రసాయనాలు వాడని కూరగాయలు వల్ల ప్రజలకు ఆరోగ్యపరంగా కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా కార్యాలయ డీటీ జూలియాభాయ్ సేంద్రియ ఉత్పత్తులను పొదుపు మహిళల వద్ద కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించారు.

రూ.10 లక్షలతో శ్మశానం అభివృద్ధి



ఎక్స్‌కవేటర్‌తో శ్మశానాన్ని శుభ్రం చేయిస్తున్న దాతలు

అల్లూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్‌కాలం నాటి క్రైస్తవ సామాజిక వర్గ శ్మశానవాటికను రూ.10లక్షల సొంత నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు యేసు అభిషేక మినిస్ట్రీష్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దేవరకొండ సామియేల్‌బాబు అన్నారు. సోమవారం ఎక్స్‌కవేటర్‌తో శ్మశాన వాటికలో కంపచెట్లను తొలగింపు చేయించారు. ప్రహరీగోడ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. శ్రమదానం చేసినవారికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవసంఘ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సుధీర్‌బాబు, టీడీపీ నాయకులు

కావలి(టౌన్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పీటర్‌పాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డీ.సుధీర్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం పేదలకు దుస్తులు పంపిణీ చేయడంతోపాటు అన్నదానం చేసి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుధీర్‌బాబు కుమారుడు ప్రీతమ్‌పాల్, మేనల్లుడు రాహుల్‌పాల్‌ల జన్మదినాన్ని పురస్కరించుకుని వెంగళరావునగర్‌లోని ఫౌండేషన్ కార్యాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఫౌండేషన్ కోఆర్డినేటర్ అడ్వకేట్ శివప్రసాదరెడ్డి,దావీద్, టీడీపీ నాయకులు శానం హరి, కృష్ణ, ఏగూరి చంద్రశేఖర్, జగన్, మాజీ కౌన్సిలర్ ఎస్‌డీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు దోచేశారు!

(5వ పేజీ తరువాయి)

దానిని క్లిక్ చేసిన వెంటనే ఆమెకు వాట్సాప్‌నకు పార్ట్‌టైమ్ జాబ్‌లు అందుబాటులో ఉన్నాయని మెసేజ్‌లు వచ్చాయి. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు కొన్ని టాస్క్‌లు ఇవ్వడంతోపాటు నగదు చెల్లించాలని సూచించారు. వారి మాటలు నమ్మిన యాఫియా పలు దఫాలుగా రూ.7.20 లక్షలు చెల్లించింది. అయితే, ఉద్యోగం రాకపోవడంతో పలుమార్లు సదరు కంపెనీని సంప్రదించేందుకు ప్రయత్నించినా కుదరలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కావలి మున్సిపాలిటీకి స్వచ్ఛ అవార్డు



వలేటివారిపాలెం : కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వర్, కావలి : కలెక్టర్, కావలి ఎమ్మెల్యేల నుంచి అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర అవార్డ్స్ 2025లో కావలి మున్సిపాల్టీ స్వచ్ఛ అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మల చేతుల మీదుగా కావలి మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ అందుకున్నారు. అలాగే కావలి పురపాలక స్వచ్ఛవారియర్స్ (పారిశుధ్య కార్మికులు)గా గుంజి అంకయ్య, మర్లపాటి భూపతి అవార్డులు పొందారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సురేష్‌రెడ్డి, కావలిపురపాలకసంఘం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బషీర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సోమవారం నెల్లూరులో ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పూలమొక్కను అందజేసారు. అనంతరం కావలి నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

చుండి మోడల్ స్కూల్‌కు..

వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి మోడల్‌స్కూల్‌కు జిల్లాస్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించింది. ఈ సందర్భంగా నెల్లూరులో సోమవారం చుండి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వర్‌కు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం

కావలి రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదరిపాళెంలో సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థాన పాంచరాత్రిగం పండితులు చంగోళం నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు పవన్‌స్వామి మహాసంప్రోక్షణ, మహాకుంభాభిషేక మహోత్సవ పూజలు జరిపించారు. ఉదయం 7 గంటల నుంచి శ్రీరామ మూలమంత్ర హోమం, సకల గాయత్రి హోమం, కుంభ ఆరాధన, కుంభ ఉద్వాసన, సంప్రోక్షణ, కుంభాభిషేకము, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11.30 గంటలకు మేళతాళాల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయం కిక్కిరిసింది. భక్తులు గోవిందనామ స్మరణలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. దేవతా మూర్తుల వేషధారణలో చిన్నారుల నృత్యప్రదర్శ అలరించింది.



మంగళసూత్రాలు చూపుతున్న ఆలయ అర్చకుడు పవన్ స్వామి

సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఏరీ?

- ఆరు చోట్ల పోస్టులు ఖాళీ
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

లింగసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సగం సచివాలయాల్లో ముఖ్యమైన డిజిటల్ అసిస్టెంటు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ఉద్యోగులను బదిలీ చేసింది. ఇందులో భాగంగా మండలంలోని 13 సచివాలయాల్లోని 6 సచివాలయాలకు చెందిన 6 మంది డిజిటల్ అసిస్టెంట్లను బదిలీ చేసింది. మండలంలోని పెదపవని-1, 2, పెంట్రాల, లింగసముద్రం-1, యర్రారెడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెం సచివాలయాలకు చెందిన డిజిటల్ అసిస్టెంట్లను ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో ఎవరినీ నియమించలేదు. దీంతో అప్పటి నుంచి ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సచివాలయాల్లో ఏపీ సేవా పోర్టల్‌లోని 536 సేవల్లో మండలంలో కనీసం 40 నుంచి 50 రకాల సేవలను అందిస్తారు. ఇందులో రెవెన్యూ సర్వీసులకు చెందిన పనులన్నీ డిజిటల్ అసిస్టెంట్లు చేస్తారు. ముఖ్యంగా మ్యుటేషన్లు, 1బీ, అడంగల్, పట్టాదారు, ఆధార్ సీడింగ్, కుల, ఆదాయ, జనన. మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన తదితర పనులను చేస్తుంటారు. వీటితో పాటు పలు రకాల సేవలను ప్రజలకు అందిస్తుంటారు. అయితే ఆయా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంటు లేకపోవడంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడం లేదు. దీంతో ప్రజలు వ్యయప్రయాసలకోర్చి ఇతర సచివాలయాలకు వెళ్లి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లింగసముద్రం-1 సచివాలయ డీఏ బదిలీపై వెళ్లడంతో ఇక్కడ ఆధార్ సేవలు పూర్తిగా నిలిచి పోయాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టి కొత్త డీఏలను నియమించి ప్రజల కష్టాలు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డును కమ్మేసిన ముళ్లచెట్లు



ఉప్పలపాడు - కొండసముద్రం రోడ్డును కమ్మేసిన చిల్లచెట్లు

వలేటివారిపాలెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పలపాడు నుంచి కొండసముద్రంనకు వెళ్లే రహదారికి రెండు వైపులా ముళ్లచెట్లు పెరిగిపోయాయి. ఏపుగా పెరిగిన ముళ్లచెట్లతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా వాహనాలు ఎదురెదురుగా వచ్చే సమయాల్లో వాహనాలు రోడ్డు మార్జిన్ దిగి ముళ్ల చెట్లు తగిలి వాహనదారులకు రక్తగాయాలై ప్రమాదాల బారిన పడుతున్నారు. కొండసముద్రం నుంచి ఉప్పలపాడు మీదుగా నిత్యం ఏదో ఒక పని మీద వాహనదారులు వలేటివారిపాలెం వస్తూనే ఉంటారు. రోడ్డును కమ్మేసిన ముళ్లచెట్లతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును కమ్మేసిన ముళ్లచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

భ్రూణ హత్యలు నివారించాలి

- ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ



భ్రూణ హత్యల నివారణపై అవగాహనకు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తదితరులు

కావలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడ, మగ శిశువుల మధ్య వివక్షతను విడనాడి భ్రూణ హత్యలు నివారించాలని కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ తెలిపారు. లింగనిర్ధారణ నిషేధిత చట్టం కావలి డివిజన్ సలహా కమిటీ సమావేశం సోమవారం సాయంత్రం స్థానిక ఆర్డీవో చాంబర్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ భ్రూణ హత్యల నివారణపై ప్రజలలో అవగాహన కల్పించాలని, ముందుగానే లింగనిర్ధారణ చేయడం నేరమని, అలా చేసిన వారిపై చర్యలు తప్పవని చెప్పాలన్నారు. భేటీ బచావో భేటీపడావో.. ఆడపిల్లలను చదివిద్దాం రక్షిద్దాం.. దీని కొరకు సమాజంలో అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ అనూష, సీడీపీవో సౌజన్య, రెండవ పట్టణ ఎస్ఐ బాషా, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్ చిత్రపటాలకు పాలభిషేకం



చంద్రబాబునాయుడు, లోకేష్ చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న ఆటో డ్రైవరు

కావలి(టౌన్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కచ్చేరిమిట్ట సచివాలయం వద్ద సోమవారం ఆటో డ్రైవర్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆటో డ్రైవర్ల ఖాతాల్లో రూ,15వేల చొప్పున జమ చేయడం హర్షదాయకమన్నారు. అందుకు కృతజ్ఞతగా వారి చిత్రపటాలకు పాలభిషేకం చేశామన్నారు. ఏ ఒక్కరిని విస్మరించకుండా ఆటో డ్రైవర్లందరీ ఖాతాల్లో నగదు జమ అయ్యేలా ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి కృషి చేసినందుకు, ఆటోలు సజావుగా నడిచేందుకు రోడ్లపై గుంతలకు మరమ్మతులు చేయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరివీధి ప్రసాద్, పెంచలయ్య పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0 సేవింగ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టరు రవికుమార్

కందుకూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సూపర్‌సేవింగ్స్‌పై స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో కళాశాల కామర్స్ డిపార్టుమెంటు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎస్టీ శ్లాబులలో వచ్చిన మార్పులు తద్వారా ప్రజలకు చేకూరే ప్రయోజనాలను వివరించటంతో పాటు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల కామర్స్ డిపార్టుమెంటు ఇన్‌చార్జి డాక్టరు సీహెచ్ శ్రీనివాసరావు, వార్డు 2 నోడల్ ఆఫీసర్ కొండమ్మ, సచివాలయం అడ్మిన్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీఆర్ఆర్ జూనియర్ కళాశాలలోను కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలి ఆధ్వర్యంలో జీఎస్టీ శ్లాబులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



కందుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాతలు, డిపో అధికారులు

కందుకూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. సవిత సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఏపీ రమేష్ తన తండ్రి అన్నంగి వెంకటరత్నం జ్ఞాపకార్థం ఈ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. రమేష్ మామ ఉమ్మడిశెట్టి సుబ్బారావు చేతులమీదుగా డిపో అధికారులు ఆ ప్లాంట్‌ను ప్రారంభింపజేశారు. డిపో మేనేజరు రాఘూరి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం దాత ఏర్పాటు చేసిన ఈ ఆర్వో ప్లాంట్ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు శ్యాంప్రసాద్, హనుమంతరావు, పద్మారావు, కే.రమేష్‌బాబు, మహేష్‌బాబు, సుబ్బారావు, సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

యూనిఫాం కుట్టు కూలీ వితరణ



విద్యార్థులకు యూనిఫాం అందజేసిన ఉపాధ్యాయులు, గ్రామస్థులు

కావలి రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో పేద విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫాం కుట్టు కూలీ కోసం గ్రామానికి చెందిన వ్యాపారవేత్తలు చెన్నా రామాంజనేయులు, కొండలరావులు సోమవారం రూ.12 వేల అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శానం కృష్ణ, బూచి మధుసూదన్‌రావు, వెంకయ్య, నాగూర్, నగేష్ ధనుష్, గ్రామానికి చెందిన సుధాకర్, వెంకటేశ్వరు పాల్గొన్నారు.



ఏమిటీ అపచారం

బీఆర్ నాయుడు గారూ?

ఆడిషనల్ ఈవో వెంకయ్య చౌదరిగారికి మాచర్లలో వారి తండ్రి శ్రాద్ధకర్మ రోజున అత్యంత పవిత్రమైన పరివట్టం కట్టడం ఏమిటి? ఆలయ బొక్కసం సంరక్షకుడైన గురురాజ స్వామి అక్కడ లడ్డూ ప్రసాదాలను పట్టుకుని వెంకయ్య చౌదరికి పరివట్టం కట్టడం, వేద పండితుల చేత ఆశీర్వచనం చేయించడం.. బీఆర్ నాయుడు చేసిన దాష్టీకం ఇది. తిరుమల ఆలయంలో రంగనాయకుల మండపంలో కప్పే పరమ పవిత్రమైనటువంటి భాగవత వస్త్రాన్ని ఏటి సూతకం ఉన్న అదనపు ఈవోకి కప్పడం ఏమిటి? రంగనాయకుల మండపంలో గానీ, బంగారు వాకిలిలోగానీ ఆలయ అధికారులకు, చైర్మన్‌కి, జియ్యర్ స్వాములకు మాత్రమే పరివట్టం కడతారు. అత్యంత పవిత్రమైన దీనిని శ్రాద్ధకర్మల రోజున చేస్తారా? స్వామి ద్రోహం ఇది. వేల సంవత్సరాల సంప్రదాయాలను ధ్వంసం చేయడం. హిందువుల మనోభావాలు దెబ్బతీయడం. రేపు ముఖ్యులు ఎవరైనా.. 'మా ఇంట్లో చనిపోయారు మీరు వచ్చి పరివట్టం కటండి, ఆశీర్వచనం ఇవ్వండి బీఆర్‌నాయుడు గారూ' అని అడిగితే ఏం సమాధానం చెబుతారు? అర్హతలేని వారికి అధికారమిస్తే అర్ధరాత్రి గొడుగు పట్టుకోనుండారంట. అలా ఉంది బీఆర్ నాయుడు పరిస్థితి.

- భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ అధ్యక్షుడు

(మీడియా సమావేశంలో సోమవారం తన ఇంటివద్ద)

ధర్మారెడ్డికి కప్పినపుడు ఏం చేస్తున్నారు భూమనా..?





అయ్యా కరుణాకరరెడ్డి గారూ మీకే వంన్నా కళ్లు కనపడడం లేదా? ధర్మారెడ్డిగారికి వారి కుమారుడు చనిపోయిన తర్వాత టీటీడీ పండితులు పరివట్టం కట్టి ఆశీర్వదించింది నిజం కాదా? మీకు తెలీదా? తెలిసి కూడా అబద్ధపు ప్రచారం చేస్తున్నారా? ఆరోజు మీరు ఎందుకు మాట్లాడలేదు. ఇప్పుడు మాత్రం అపవిత్రం అని ఎందుకు అంటున్నారు. ఇది మంచిది కాదు. గోశాల నుంచీ మీరు టీటీడీ మీద ఇలాగే చేస్తున్నారు. రాబోయే రోజుల్లో శ్రీవారి భక్తులే మీకు బుద్ధి చెబుతారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే విధంగా మీరు ప్రవర్తించడం ఇకనైనా మానుకోవాలని గట్టిగా హెచ్చరిస్తున్నా.

- భానుప్రకాష్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు (సోమవారం విడుదల చేసిన వీడియో ప్రకటనలో)



రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ద్వారా అవార్డు అందుకుంటున్న రెడ్డిజీష్ణు

తిరుపతి విద్యార్థికి జాతీయ అవార్డు

చిత్తూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థి డి.రెడ్డి జీష్ణు.. జాతీయ స్థాయి ఉత్తమ సేవా అవార్డును ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. ఎన్‌ఎస్‌ఎస్ 2022-23 సంవత్సరానికి వలంటీర్ విభాగంలో ఈ అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం చిత్తూరు అపోలో యూనివర్సిటీలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్నట్లు అపోలో యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఇతను ఆరోగ్య అవగాహన, పర్యావరణ సంరక్షణ, రక్తదానం, గ్రామాల్లో శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారని వివరించింది. అలాగే 11,130 మొక్కలు నాటినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా యూనివర్సిటీ వీసీ వినోద్‌భట్, రిజిస్ట్రార్ పోతురాజు తదితరులు కూడా విద్యార్థిని అభినందించారు.



తడి చెత్త, పొడి చెత్తపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న పంచాయతీ అధికారులు

అద్దంలా పల్లెలు

స్వచ్ఛతే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు

- గ్రామాల్లో అవగాహనకు కదిలిన సీఆర్పీలు
- జనవరి నాటికి చెత్త కనబడకుండా ప్రణాళిక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రతే కాదు.. పరిసరాలూ శుభ్రంగా ఉంచుకోవాలనే మహాత్మా గాంధీ మాటలకు ఆచరణ రూపం ఇచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో అడుగులు వేస్తోంది. చెత్తరహిత గ్రామాలే లక్ష్యంగా ప్రణాళికాయుతంగా పనిచేస్తోంది. మరో మూడు నెలల తర్వాత పల్లెలన్నీ అద్దంలా కనిపించాలని దృఢంగా సంకల్పిస్తోంది. ఈక్రమంలోనే స్వచ్ఛభారత్ మిషన్ కింద కేంద్రంతో కలిసి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల్లో పరిశుభ్రత పర్యవేక్షణకు ప్రతి కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్(సీఆర్పీ)లను నియమించింది. జిల్లాలో 411మంది డ్వాక్రా సభ్యులను ఇందుకోసం ఎంపిక చేసింది. గూడూరు, తిరుపతి, శ్రీకాళహస్తి వేదికలుగా ఇప్పటికే శిక్షణ ఇచ్చింది. రానున్న మూడు నెలల్లో జిల్లాలోని 774 గ్రామపంచాయతీల్లోని 4.36లక్షల ఇళ్లను సీఆర్పీలు సందర్శించనున్నారు. వెయ్యిమందికి ఒకరు వంతున వీరు కొద్దిరోజులుగా పల్లెల్లో తిరుగుతున్నారు. ఇంటి దగ్గరే తడిచెత్త, పొడిచెత్తలను వేర్వేరు డబ్బాల్లో వేసేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పరిశుభ్రత పాటించడం, డ్రైనేజీలో చెత్త వేయకుండా చూడటం లాంటి విషయాల్లో చైతన్యం కలిగిస్తున్నారు. జనవరి నుంచి గ్రామాల్లో చెత్త కనిపించకుండా ఉంచాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధనకు వీరంతా నడుం బిగించారు.

> **ఇక నుంచి పకడ్బందీగా కార్యాచరణ**
>
> జిల్లాలోని ప్రతి గ్రామాన్ని చెత్తరహితంగా తీర్చిదిద్దడంలో సీఆర్పీలు కీలకంగా వ్యవహరిస్తారు. వీరికి రూ.10వేల వేతనం చెల్లిస్తాం. సీఆర్పీలు ఇంటింటికి వెళ్లి చెత్త నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నెల ఒకటి నుంచి స్వచ్ఛత కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా అమలు చేస్తున్నాం.
>
> - సుశీలాదేవి, డీపీవో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

బ్యాటరీ బండ్లను బాగుచేస్తాం

తిరుపతి, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో రోగుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాలను (ఈ-బగ్గీస్) బాగుచేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్‌కు అనుబంధంగా ఉండే శ్రీపద్మావతి ఆస్పత్రి సెల్లార్‌లో మూలన పడేసిన ఈ-బగ్గీస్‌పై 'ఈ బ్యాటరీ బండ్లు బయటకు తీయండి సారూ..' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన ప్రకటన విడుదల చేశారు. రెండు వాహనాలకు టైర్లు, ఇతర స్పేర్ పార్ట్స్ పాడైపోయాయని వీటి నిర్వహణ చూసే కోయంబత్తూరుకు చెందిన రూట్స్ కంపెనీకి సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. మిగిలిన మూడింటిని ఉపయోగిస్తున్నామని తెలిపారు. పాడైన వాటినీ త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

పింఛను కోసం స్ట్రెచర్‌పై కలెక్టరేట్‌కు

సరిగ్గా మధ్యాహ్నం 12.30 గంటలు. కలెక్టరేట్ వద్దకు ఓ అంబులెన్సు వచ్చింది. అందులో నుంచి 22 ఏళ్ల యువకుడిని స్ట్రెచర్‌పై లోపలకు తీసుకొచ్చారు. ఇతడి పేరు ఎన్.లక్ష్మయ్య. ఉండేది నారాయణవనం మండలం సుబ్బయ్యనాయుడుకండ్రిగ నక్కబోయిన అరుంధతివాడ. పెయింట్ పనులకు వెళ్లే ఇతడు.. మూడేళ్ల కిందట భవనంపై నుంచి పడ్డారు. వెన్నెముక దెబ్బ తినడంతో నాటి నుంచి మంచానికే పరిమితమయ్యారు. తండ్రి మరణించడంతో తల్లి రేణుకమ్మ కూలీనాలీ చేసుకుని లక్ష్మయ్య ఆలనాపాలన చూస్తోంది. మంచానికే పరిమితమైన ఈ యువకుడికి వికలాంగ పింఛను కోసం మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారే కానీ, మంజూరు కాలేదు. ఈ క్రమంలో సోమవారం అంబులెన్సులో స్ట్రెచర్‌పై కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌కు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న జేసీ శుభం బన్సల్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు లక్ష్మయ్య వద్దకు వచ్చి సమస్య అడిగి తెలుసుకున్నారు. ఇతడి ఆవేదనను కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లగా లక్ష్మయ్యకు పింఛను ఇప్పించాలని అధికారులను ఆదేశించారు.

- తిరుపతి కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి



స్ట్రెచర్‌పై ఉన్న లక్ష్మయ్యతో మాట్లాడుతున్న జేసీ

నేడు స్వగ్రామానికి సీఎం

- సోదరుడి సంవత్సరీకంలో పాల్గొననున్న చంద్రబాబు
- పూర్తయిన ఏర్పాట్లు





సీఎం ఇంటి ముందు బందోబస్తు.. లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న కోడూరు బాలసుబ్రహ్మణ్యం

తిరుపతి/తిరుపతి(నేరవిభాగం/కలెక్టరేట్)/చంద్రగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లెకు రానున్నారు. తన సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడి సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొననున్నారు. దీనికోసం ఆయన ఉండవల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11 గంటలకు చంద్రగిరి మండలం ఎ.రంగంపేటకు చేరుకుంటారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన నారావారిపల్లె వెళ్లనున్నారు. 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు.. రెండు గంటల పాటు నారావారిపల్లెలో గడుపుతారు. తన నివాసంలో సోదరుడి సంవత్సరీకానికి సంబంధించిన పూజల్లో పాల్గొంటారు. అనంతరం కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులతో కలసి రామ్మూర్తినాయుడు సమాధిని సందర్శించి నివాళులర్పిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి ఎ.రంగంపేట హెలిపాడ్‌కు చేరుకుని తిరుగు ప్రయాణమవుతారు. కాగా, సోమవారం ఉదయం రామ్మూర్తి నాయుడు సతీమణి నారా ఇందిర, ఆయన పెద్ద కుమారుడు గిరీష్, మధ్యాహ్నం చిన్న కుమారుడు, సినీ హీరో రోహిత్, సాయంత్రం 6 గంటలకు సీఎం సతీమణి భువనేశ్వరి నారావారిపల్లెకు చేరుకున్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ రాత్రి 11.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోగా టీడీపీ నేతలు స్వాగతం పలికారు. 12.05 గంటలకు నారావారిపల్లెకు వచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు పులివర్తి నాని, సుధీర్‌రెడ్డి, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి ఉన్నారు. మంగళవారం ఉదయం లోకేశ్ సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ రానున్నారు. కాగా, చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబీకులు హెలికాప్టర్‌లో ఉండవల్లి వెళ్లనున్నారు. 11వ నెల విస్తర కార్యక్రమ ఏర్పాట్లు పూర్తయ్యాయి. పొలంలో రామ్మూర్తి నాయుడు ఘాట్ నిర్మించారు. 10 వేలమందికిపైగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం ఇంటి సమీపంలో సంతాప సభ కోసం ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేశారు.



నారావారిపల్లెలో ఏర్పాట్లపై నారా గిరీష్, రవినాయుడుతో చర్చిస్తున్న కలెక్టర్

> **నారావారిపల్లెలో భారీ బందోబస్తు**
>
> సీఎం పర్యటన నేపథ్యంలో నారావారిపల్లెలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం ఇంటి వద్ద రిజర్వు బలగాలు తనిఖీలు చేస్తున్నాయి. రెండు డాగ్ స్క్వాడ్‌లు, రెండు బాంబు నిర్వీర్యం స్క్వాడ్‌లు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. తిరుపతికి బాంబు బెదిరింపు మెయిల్స్ నేపథ్యంలో ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 18 మంది సీఐలు, 50 మంది ఎస్‌ఐలు, మరో 500 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, ఇతర బలగాలు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో భద్రతా చర్యలు చేపట్టారు. కాగా, కార్యక్రమ ఏర్పాట్లను సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ చైర్మన్ రవి నాయుడు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, తాతయ్యగుంట గంగమ్మగుడి చైర్మన్ మహేష్, పారిశ్రామిక వేత్త ఏవీ రమణమూర్తి తదితరులు పర్యవేక్షించారు. కాగా, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడు కుటుంబాన్ని మంగళవారం ఉదయం మంత్రి లోకేశ్ పరామర్శించనున్నారు.

51 మందికి స్వచ్ఛాంధ్ర అవార్డులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా స్వచ్ఛాంధ్రలో 18 విభాగాల్లో ప్రతిభ చూపిన 51 మంది అధికారులు, కార్మికులకు సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో అవార్డులు ప్రదానం చేశారు. ఈ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలు మరింత భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన, ప్రజల్లో చైతన్యం తీసుకు రావడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. డిసెంబరుకల్లా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ నిర్మూలించేలా ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలన్నారు. రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ మున్సిపాలిటీల్లో తిరుపతికి అవార్డు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, డీపీవో సుశీలదేవి, వివిధ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు శ్రీధర్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా అవార్డులు అందుకున్న కార్మికులు, అధికారులతో కలెక్టర్, జేసీ



వ్యవసాయ కళాశాలను తనిఖీ చేస్తున్న బాంబు స్క్వాడ్ సిబ్బంది

బాంబులు.. ఎప్పుడైనా పేలొచ్చు

- వ్యవసాయ కళాశాలకు బెదిరింపు మెయిల్
- అంతా ఫేక్ అని తేల్చిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతికి బాంబు బెదిరింపు మెయిల్స్ ఆగడం లేదు. మళ్లీ మళ్లీ అగంతకుడు ఇదే తరహా మెయిళ్లు పంపుతూనే ఉన్నారు. ఈసారి తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాలలో ఐఈడీ ఆర్‌డీఎక్స్ బాంబులు పెట్టామని, ఎప్పుడైనా పేల్చుతామని బెదిరిస్తూ ఆదివారం అర్ధరాత్రి మెయిల్ పంపారు. అధికారుల ఫిర్యాదుతో తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, ఎస్‌ఐలు, బాంబు డిస్పోజల్.. డాగ్ స్క్వాడ్‌లు ఏఎస్‌ఐ రమేష్, చాంద్‌బాషా, బీరయ్య, సిబ్బంది తదితరులు సోమవారం ఉదయం నుంచి మూడు గంటల పాటు కళాశాలలో తనిఖీలు చేపట్టారు. సీఎం చంద్రబాబు మంగళవారం నారావారిపల్లెకు వస్తుండడంతో ఈ మెయిల్ వచ్చిన క్రమంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కాగా, ఇలాంటి మెయిల్స్ ఎక్కడ నుంచి వస్తున్నాయి? దీని వెనుక ఎవరున్నారనే దానిపై పోలీసు యంత్రాంగం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.

ఈ-క్రాప్ నమోదు గడువు పెంపు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు గడువును ఈనెల 25వ తేదీ వరకు పెంచినట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి ప్రసాదరావు తెలిపారు. సామాజిక తనిఖీ, సవరింపులు, మార్పు చేర్పులకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశముంటుందని పేర్కొన్నారు. తుది జాబితాను ఈనెల 31వ తేదీ రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారని వివరించారు. ఈసారి ఈకేవైసీని నోటిఫైడ్ పంటలకు మాత్రమే పరిమితం చేసినట్లు తెలిపారు. వ్యవసాయ, ఉద్యా న, పట్టు, సామాజిక అడవులు, బీడు భూములను ఈ-పంటలో నమోదు చేయాల్సి ఉందని ఒక ప్రకటనలో తెలిపారు.

బీటెక్ సెల్ఫ్ ఫైనాన్స్ ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెల్ఫ్ ఫైనాన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (స్విడన్) ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈఏపీసెట్-2025లో అర్హత పొందిన విద్యార్థులు ఇందుకు అర్హులు. ఆసక్తి కలిగిన వారు.. యూనివర్సిటీలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో, 0877-2248589లో సమాచారం పొందవచ్చని ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు తెలిపారు.

తిరుమలలో నేడు పున్నమిగరుడసేవ

తిరుమల, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం పున్నమి గరుడసేవ జరుగనుంది. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 28న గరుడవాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు పదిరోజుల వ్యవధిలోనే మరోసారి గరుడునిపై కొలువుదీరి దర్శనమివ్వనున్నారు. మంగళవారం రాత్రి7 నుంచి 9గంటల నడుమ ఊరేగింపు జరుగుతుంది.

ఘాట్‌లో అదుపుతప్పిన జీపు

● ఎనిమిది మందికి గాయాలు

తిరుమల, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో సోమవారం ఓ జీపు అదుపుతప్పి క్రాష్‌బారియర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో ఎనిమిదిమంది గాయపడ్డారు. తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకుని జీపులో తిరుపతికి వసస్తుండగా 24వ మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. జీపులోని నలుగురు హిందూపురం భక్తులు, ఇద్దరు ఒడిస్సా రాష్ట్రవాసులు, ఓ తమిళ భక్తుడితో పాటు తిరుపతికి చెందిన డ్రైవర్ గాయపడ్డారు.వీరిని 108 అంబులెన్స్ ద్వారా తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.





ప్రమాదానికి గురైన జీపు - ప్రమాదానికి గురైన జీపు, డ్రైవర్



అంబులెన్స్‌లో క్షతగాత్రులు

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ దాటి బాటగంగమ్మ ఆలయ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.89 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 83,412

తలనీలాలు సమర్పించినవారు: 33,058



నాన్ మెడికల్ నియామకాలపై మౌనమేల?

● 15నుంచి ఇంటర్వ్యూలకు కసరత్తు

● కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు ● నాన్ మెడికల్ అభ్యర్థులకు నో కాల్

తిరుపతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని స్విమ్స్‌లో ఫ్యాకల్టీ నియామక ప్రక్రియపై ఎంపిక కమిటీ కసరత్తు మొదలుపెట్టింది. నోటిఫికేషన్‌లోని 104 పోస్టులకుగాను 315 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి సుమారు 210 మందికి కాల్ లెటర్లు పంపినట్టు తెలిసింది. ఈనెల 15నుంచి 17వరకు రోజుకు 70 మంది చొప్పున ఇంటర్వ్యూకు పిలిచినట్టు సమాచారం. అయితే నాన్ మెడికల్ అభ్యర్థులకు కాల్ లెటర్లు అందలేదు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ వంటి నాన్-మెడికల్ పోస్టులకు ఇదేవిభాగాలకు సంబంధించి స్విమ్స్ వర్సిటీలోనే పీజీ, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులను పక్కనపెట్టడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే, డెంటిస్ట్రీలోని ఓరల్ అండ్ మాక్సిల్లోఫేసియల్ సర్జరీ పోస్టుపై వచ్చిన ఆరోపణలపై వాటిని తాత్కాలికంగా హోల్డ్‌లో పెడుతున్నట్టు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ మీడియా అడిగితే చెప్పారు కానీ అధికారిక వెబ్‌సైట్‌లోనూ, అధికారిక ప్రకటనగానూ విడుదల చేయలేదు. దీని వల్ల అభ్యర్థుల్లో అనుమానాలు మరింత పెరిగాయి.

గతంలోనూ ఇలా...

2023 నియామకాల సమయంలోనూ ఇదే పరిస్థితి చోటు చేసుకుంది. అప్పట్లో నాన్-మెడికల్ ఫిజియాలజీ పోస్టుపై కోర్టు ఆదేశాలు వచ్చినప్పటికీ, స్విమ్స్ ఆ పోస్టును మాత్రమే నిలిపివేసి మిగతావన్నీ భర్తీ చేసింది. అప్పట్లో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ అర్హతలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చినా, అమల్లో మాత్రం ఎంబీబీఎస్, ఎండీ ఆధారిత అభ్యర్థులకే ప్రాధాన్యమిచ్చారు. తాజా నోటిఫికేషన్‌లో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ అర్హతలను పూర్తిగా నిరాకరించడం అభ్యర్థుల్లో నిరాశ, అభ్యంతరాలు రేపుతోంది. ఒక వైపు నియామకాలను వేగంగా నడిపిస్తూ, మరో వైపు కీలక విషయాల్లో స్పష్టత ఇవ్వకుండా ఉండటం వల్ల స్విమ్స్‌లో డ్యుయల్ మేనేజ్‌మెంట్ కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాన్ మెడికల్ అంటే ఎందుకంత చిన్నచూపు

ఎండీ చేసిన అభ్యర్థి స్విమ్స్‌లో అడహక్ కింద చేరిన ఏడాదికే పర్మినెంట్ అయిపోతున్నారు. కమ్యునిటీ మెడడిస్ విభాగంలో ఓ సీనియర్ స్టాటిస్టీషియన్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదా ఇవ్వకుండా అడ్డంకులు పెడుతున్నట్టు తెలుస్తోంది. పీహెచ్‌డీ చేసిన సదరు స్టాటిస్టీషియన్‌కు ఎన్ఎంసీ నిబంధనల మేరకు అర్హత ఉన్నప్పటికీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించడంలేదు. దీనిపై ఆమె అలుపెరగని పోరాటం చేస్తున్నారు. స్టేట్ యాక్ట్‌తో నడుస్తున్న స్విమ్స్ సంస్థ యాజమాన్యం ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టాలనుకోవడం సరికాదని అభ్యర్థులు వాపోతున్నారు.

‘బెల్టు’ తీస్తున్నారు

● అక్రమ మద్యంపై ఉక్కుపాదం ● నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

● ఆర్నెళ్లలో వందకుపైగా కేసుల నమోదు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టు దుకాణాల కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. ఏమాత్రం తేడా వచ్చినా అధికార యంత్రాంగం ఉక్కు పాదం మోపుతోంది. ఎంఆర్‌పీ ధరకు మించి విక్రయించినా, గ్రామాల్లో బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసినా, నాసిరకం అంటగట్టినా జరిమానాలతో సరిపెట్టకుండా లైసెన్సులు రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈక్రమంలోనే జిల్లాలో గడచిన ఆరు నెలల్లో ఎక్సయిజ్ అధికారులు సుమారు వందకు పైగా కేసులు నమోదు చేశారు. జిల్లాలో 11 ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో తిరుపతి, తిరుపతి రూరల్, పరిధిలో అత్యధిక షాపులున్నాయి. అన్ని సర్కిళ్లలో ప్రత్యేక టీముల అధికారులు అమ్మకాల తీరుపై ప్రత్యేక నిఘా పెట్టారు. మద్యం దుకాణాలతో పాటు ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన బార్లలోనూ తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఏ పరిస్థితుల్లోనూ రాజీ పడరాదనే సీఎం ఆదేశాలను తూ.చా.తప్పకుండా క్షేత్ర స్థాయిలో అమలు చేస్తున్నారు. ప్రధానంగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటుసారా, కల్లు, ఇతర మత్తు పదార్థాలు పొరుగురాష్ట్రాల నుంచి రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. బెల్టు షాపులపైనా సగటున నెలకు 20 కేసులు నమోదు చేస్తున్నారు. ఎంఆర్‌పీ ధర ఉల్లంఘనలు అతిక్రమించకుండా ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం నాణ్యత పరిశీలనకు 13 పారామీటర్లను అనుసరిస్తున్నారు.

ఎవ్వరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదు



నాసిరకం మద్యం, బెల్టు షాపుల విషయంలో కఠినంగా ఉంటున్నాం. నిరంతర నిఘా పెట్టాం. ఎంఆర్‌పీ ధరలకు మించి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులందితే సీరియస్‌గా పరిగణిస్తున్నాం. ఇప్పటికే మద్యం దుకాణాల యజమానులకు మార్గదర్శకాలు జారీ చేశాం. డిపో నుంచి వచ్చిన మద్యం, దుకాణాల్లో బాటిళ్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. ఒకటికి రెండు సార్లు చెప్పిగా వినకపోతే షాపుల లైసెన్సుల రద్దుకు వెనుకాడేదిలేదు

- నాగమల్లేశ్వర రెడ్డి,జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

పీజీఆర్ఎస్‌కు 276 వినతులు

● అత్యధికం రెవెన్యూ శాఖవే



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 276 వినతులు వచ్చాయి. అందులో అత్యధికంగా 157 రెవెన్యూ శాఖకు సంబంధించినవే వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేశారు. ప్రతి అర్జీనీ సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ అధికారిపై చర్యలు తీసుకోండి

సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల గురించి అసభ్యంగా మాట్లాడిన జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డిని విధుల నుంచి తొలగించి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బహుజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మాధవ్, నాయకులు వెంకయ్య, సూర్య, కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పీహెచ్‌డీ ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

● దరఖాస్తుకు 21వ తేదీ గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2024-25 పేర ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు.ఏపీఆర్‌సెట్-2024-25 నిర్వహణ బాధ్యతను పద్మావతి మహిళా యూనివర్సిటీకి ప్రభుత్వం అప్పగించింది. దరఖాస్తుకు ఈనెల 21వ తేదీ చివరి గడువు విధించారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.1000, బీసీలకు రూ.1300, ఓసీలకు రూ. 1500 దరఖాస్తు రుసుం నిర్ణయించారు. నవంబరు 3నుంచీ 7వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 14 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఏపీఆర్‌సెట్-2024-25 కన్వీనర్ ప్రొఫెసర్ ఉష, కో-కన్వీనర్ ప్రొఫెసర్ జాన్ సుష్మ తెలిపారు.

‘ఎర్ర’స్మగ్లర్‌కు మూడేళ్ల జైలుశిక్ష : రూ.20వేల జరిమానా



ముద్దాయిని సబ్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం)/పిచ్చాటూరు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. నారాయణవనం మండలం ఇరకంబట్టు గ్రామానికి చెందిన టి.సురేష్ 2015లో కేవీబీపురం మండల పరిధిలోని నిషేధిత రిజర్వు ఫారెస్టులోకి చొరబడి ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తరలిస్తుండగా పిచ్చాటూరు పోలీసులు అరెస్టు చేశారు.కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.పదేళ్లుగా విచారణలో ఉన్న ఈ కేసును ఇటీవల తిరుపతి ఎర్రచందనం కోర్టుకు మార్చారు. పోలీసులు సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించడంతో న్యాయమూర్తి జైలుశిక్షతోపాటు జరిమానా విధించారు. ముద్దాయిని చిత్తూరు సబ్‌జైలుకు తరలించారు.

టీడీపీ నేతపై వైసీపీ సర్పంచ్ దౌర్జన్యం

● నీటిపారుదలశాఖ అధికారుల సాక్షిగా దాడికి యత్నం

● బాధితుడు వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్

తడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల బరితెగింపు దాడులు ఆగడం లేదు. సాక్ష్యాత్తు నీటిపారుదలశాఖ అధికారుల సాక్షిగా టీడీపీ నేతపై వైసీపీ సర్పంచ్ దాడికి దిగిన ఘటన తడ మండలంలో సోమవారం జరిగింది. మండలంలోని పూడి చెరువు మరమ్మతులు చేయాలని నీటిపారుదలశాఖ అధికారులు నిర్ణయించారు. ఆ శాఖ ఈఈతో పాటు ఏఈల కూడిన అధికారుల బృందం సోమవారం మధ్యాహ్నం చెరువును పరిశీలించింది. వారితో పాటు వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవి సెల్వం కూడా ఉన్నారు. అదే సమయంలో వైసీపీ నాయకుడు, పూడి సర్పంచ్ ఓబులాపురం పరమశివం కుమారులు విశ్వనాథన్, శివకుమార్ అక్కడకు వచ్చి కొలవి సెల్వంతో గొడవకు దిగారు. బూతులు తిడుతూ దాడి చేశారు. దీంతో బిత్తరపోయిన సెల్వం కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న గ్రామస్తులు వచ్చి దాడిని అడ్డుకున్నారు. ఈదంతా చూస్తున్న అధికారులు నిశ్చేష్టులై నిలబడిపోయారు. ఈ ఘటనపై బాధితుడు సెల్వం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాతకక్షలను దృష్టిలో ఉంచుకొని తనపై అకారణంగా దాడిచేసి కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



గల్లంతైన బాలుడు కోసం పులికాట్‌లో గాలిస్తున్న మత్స్యకారులు



విషాదంలో యువకుడి బంధువులు

పడవలో నుంచి జారి..

పులికాట్ సరస్సులో బాలుడి గల్లంతు

● తీవ్రంగా గాలిస్తున్న మత్స్యకారులు

తడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సులో పడవలో వెళ్తున్న ఓ బాలుడు అదుపుతప్పి నీళ్లలో పడి గల్లంతయ్యాడు. తడ మండలం ఇరకందీవికి చెందిన తెరిగిపి ఆర్ముగం కుటుంబం తమిళనాడు ఎన్నూరుకుప్పం గ్రామానికి వెళ్లి అక్కడే నివాసం ఉంటోంది. పెరటాసి నెల 3వ శనివారం నాడు కుటుంబంతో సహా గ్రామానికి వచ్చారు. సోమవారం ఉదయం తమిళనాడులోని సున్నాంబకులం వెళ్లేందుకు ఆర్ముగం తన మనవడు తెరిగిపి హేమరాజ్(17) కలిసి పడవలో బయలుదేరారు. పులికాట్ సరస్సులో కొంత దూరం వెళ్లాక అల్లల ఉధృతికి పడవ అటు ఇటు ఊగడంతో అంచుపై కూర్చున్న హేమరాజ్ అదుపుతప్పి నీళ్లల్లో పడిపోయాడు. పడవలో ఉన్న ప్రయాణికులు గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో ఇరకందీవి గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో మత్స్యకారులు పడవల్లో బయలుదేరి ఘటనాస్థలికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు కూడా ఘటనాస్థలికి వెళ్లారు. రాత్రి వరకు గాలించినా హేమరాజ్ ఆచూకీ దొరకలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలు ఆపేసి.. మంగళవారం ఉదయం మొదలు పెట్టనున్నారు.



చేతిలో కత్తి పెట్టుకుని వీరంగం చేస్తున్న ఫిరోజ్

మద్యంతాగి.. కత్తితో వీరంగం

● తిరుపతిలో ఇద్దరిని అరెస్టు చేసి.. వీధిలో నడిపించుకుంటూ వెళ్లిన పోలీసులు



నిందితులను రోడ్డుపై తీసుకెళుతున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రౌడీ కల్చర్ కోరలు చాచింది. ఓ రౌడీ మద్యం మత్తులో కత్తితో వీరంగం చేస్తూ నడిరోడ్డుపై సోమవారం జనాలను భయభ్రాంతులకు గురిచేశాడు. ఇతడితోపాటు ప్రత్యర్థినీ పోలీసులు అదుపులోకి తీసుకుని వీధిలో నడిపించుకుంటూ తీసుకెళ్లారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తిరుపతి నగరం ఎస్టీవీ నగర్‌కు చెందిన ఫిరోజ్, సయ్యద్ బాషా కొన్నేళ్లుగా పాత కక్షలున్నాయి. గతంలో వీరిద్దరూ కత్తులతో పొడుచుకుని హత్యాయత్నాలకు పాల్పడ్డారు. జైలుకూ వెళ్లి వచ్చారు. ఫిరోజ్ రౌడీలా తిరుగుతూ, స్నేహితులతో గలాటాలకు దిగి బెదిరించడం పరిపాటిగా మారింది. ఇతడిపై దాదాపు 19 కేసులు ఉన్నాయని, ఇది వరకే రౌడీ షీట్ నమోదై ఉందని ఈస్ట్ సీఐ శ్రీనివాసులు చెప్పారు. అడ్డగోలు సంపాదనకు అలవాటు పడ్డ సయ్యద్ బాషా, ఫిరోజ్ మధ్య ఆర్థిక లావాదేవీలు, ఇతర వ్యవహారాల్లో తీవ్ర గొడవలున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఎస్టీవీ నగర్‌లోని విక్టరీ వైన్స్ వద్ద ఫిరోజ్ మద్యం తాగి, చేతిలో కత్తి పెట్టుకుని వీరంగం చేశాడు. బాగా తెలిసిన వారికి కత్తి చూపిస్తూ భయభ్రాంతులకు గురిచేశాడు. అదే షాపు వద్ద సయ్యద్ బాషా కూడా మద్యం తాగుతున్నాడు.ఈ క్రమంలో ఫిరోజ్ వీడియోలు సోషల్ మీడియాల్లో వైరల్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాలతో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది అక్కడికి వెళ్లారు. నడి రోడ్డుపై కత్తి పెట్టుకుని వీరంగం చేస్తున్న ఫిరోజ్‌ను, అక్కడే ఉన్న సయ్యద్‌బాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ఎస్టీవీ నగర్‌లో జరిగిన రెండు ఘటనల్లోనూ ఫిరోజ్ హస్తం ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కాగా, ఫిరోజ్, సయ్యద్‌బాషాపై ఆర్మ్స్ యాక్టు కింద కేసు నమోదు చేసి ఈస్ట్ స్టేషన్ నుంచి వీధుల్లో నడిపించుకుంటూ కోర్టు వద్దకు తీసుకెళ్లారు. న్యాయమూర్తి వారికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ శ్రీనివాసులు చెప్పారు. గత కొంత కాలంగా పోలీసుల రికార్డుల్లోకెక్కిన రౌడీల పట్ల పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడం, వారి కదలికలపై నిఘా ఉంచి చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా వీరిపట్ల కఠిన వైఖరి అవలంబించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులే భావి శాస్త్రవేత్తలు

● ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో షార్ డైరెక్టర్ పద్మకుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్

సూళ్లూరుపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకుంటే ఇస్రోకు భావి శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అన్నారు. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో సోమవారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారిని శాస్త్రవేత్తలుగా తీర్చి దిద్దేందుకు ఇస్రో ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగానే ఏటా అక్టోబరు 4 నుంచి 10వ తేదీ వరకు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాలు, వాటి పనితీరుపై అవగాహన కల్పించి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఏపీతో పాటు తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో కూడా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతరిక్ష ఫలాలు సామాన్యులకు సైతం అందేలా ఇస్రో కృషి చేస్తోందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పూణెలోని ఇంటర్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ రఘునాథన్ శ్రీఆనంద్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్సు రంగం పట్ల పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుంటే శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. మన శాస్త్రవేత్తలు తక్కువ ఖర్చుతోనే చంద్రయాన్, మంగళయాన్, ఆదిత్యాఎల్ 1 వంటి ప్రయోగాలు చేపట్టడం దేశానికే ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెరియన్, షార్ కంట్రోలర్ జి.రమేష్ బాబు, అంతరిక్ష వారోత్సవాల కమిటీ చైర్మన్ శంబు ప్రసాద్, రేంజ్ ఆపరేషన్ డైరెక్టర్ ఎస్.సునీల్, ఎంఎస్‌పి డీడీ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చలపతిరావును శాలువా కప్పి ఆహ్వానిస్తున్న అధికారులు

స్మగ్లర్లు అడవుల్లోకి రాకుండా చర్యలు

అటవీ శాఖ అధికారులతో పీసీసీఎఫ్ చలపతిరావు

మంగళం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్మగ్లర్లు అడవుల్లోకి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్టు పీవీ చలపతిరావు అటవీ, టాస్క్‌ఫోర్సు అధికారులకు సూచించారు. తిరుపతి బయోట్రిమ్‌లో సోమవారం తిరుపతి, కర్నూలు సర్కిళ్ల అటవీశాఖ, ఏపీ టాస్క్‌ఫోర్సు అదికారులతో ఆయన సమావేశమయ్యారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన ఏపీ టాస్క్‌ఫోర్సు, అటవీ శాఖ బలగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న దుంగలను ఎప్పటికప్పుడు గోదాములకు తరలించి, భద్రపరచాలన్నారు. ఎర్రచందనం సాగు, లోకల్ మార్కెట్‌లో విక్రయాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎర్రచందనం బొమ్మలు, ఇతర వస్తువుల తయారీ, మార్కెటింగ్ వంటి అంశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ సీసీఎఫ్ సెల్వం, కర్నూలు సర్కిల్ సీసీఎఫ్ కృష్ణమూర్తి, టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి తిరుపతి సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, డీఎఫ్‌వో పవన్‌కుమార్ రావు, ఎర్రచందనం గోదాము రవిశంకర్‌శర్మ, తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో కొండారెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ సహకార సదస్సు

● వివిధ రాష్ట్రాల నుంచి 80 మంది డెలిగేట్స్ రాక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తిరుపతి తాజ్ హోటల్ వేదికగా బుధవారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సహకార రంగాల ఐఏఎస్ అధికారులు, ప్రతినిధులు హాజరుకానున్నారు. మంగళవారం డెలిగేట్స్ తిరుపతికి చేరుకోనున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ హాజరుకానున్నారు. ఆయా రాష్ట్రాల్లోని సహకార రంగంలో అమలవుతున్న సంస్కరణలు, వివిధ అంశాలపై ఎగ్జిబిషన్ ఉంటుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జాతీయ సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్‌బూటానీ, జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్‌జైన్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ పర్యవేక్షణలో ఈ సదస్సు జరుగుతుంది.

9నుంచి ఎస్వీయూ ఇంటర్ కాలేజీ గేమ్స్‌కు ఎంపిక

తిరుపతి(క్రీడలు), అక్టోబర్ 6(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంటర్ కాలేజీ మెన్ అండ్ ఉమెన్ గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎస్వీయూ వ్యాయామ విభాగాధిపతి ఎం.శివశంకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. 9న బాక్సింగ్, జూడో, కరాటే, తైక్వాండో, సాఫ్ట్‌బాల్, బాస్కెట్‌బాల్ పురుష క్రీడాకారుల ఎంపిక, 14, 15 తేదీల్లో బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, హాకీ, క్రికెట్‌కు సంబంధించి మహిళా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఎస్వీయూలో జరుగుతాయని వెల్లడించారు. 17, 18 తేదీల్లో ఫుట్‌బాల్, హాకీ, బాల్‌బ్యాడ్మింటన్ పురుష క్రీడాకారుల ఎంపిక పోటీలు ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాలలో ఉంటాయని పేర్కొన్నారు. 22, 23 తేదీల్లో ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్ పురుష క్రీడాకారుల ఎంపిక పోటీలు ఎస్వీయూలో నిర్వహిస్తారని తెలిపారు. 29, 30 తేదీల్లో చెస్, బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్ పురుష క్రీడాకారుల ఎంపిక పోటీలు మదనపల్లెలోని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ మైదానంలో జరుగుతాయన్నారు. నవంబర్ 4, 5తేదీల్లో మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలకు సంబంధించిన ఎంపిక పోటీలు ఎస్వీయూలో, అదేనెల 18న మెన్ క్రికెట్ పోటీలు ఎస్వీయూ మైదానంలో ఉంటాయని తెలిపారు. చివర్లో ఎస్వీయూ ఇంటర్ కాలేజీ మెన్ అండ్ ఉమెన్ స్టాఫ్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వివరించారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు



కేవీ నాయుడిని సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెళ్లకూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులకు ఎరువులు కొరత లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని చిల్లకూరు సొసైటీ అధ్యక్షుడు కొచ్చర్ల వెంకటరమణయ్య నాయుడు అన్నారు. సోమవారం పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అధ్యక్షత నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కేవీ నాయుడు మాట్లాడారు. తొలుత ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రబీ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారని, నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులకు ముందుగా యూరియా, ఎరువులు అందించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. అనంతరం కేవీనాయుడు మాట్లాడుతూ ప్రతి రైతుకూ సరిపడే ఎరువులు ప్రభుత్వం అందిస్తుందని చిల్లకూరు సొసైటీ ద్వారా యూరియా, ఎరువులు అందించనున్నట్లు తెలిపారు.జీలపాటూరు పంచాయతీ సర్పంచు కందమూడి శివకుమార్ మాట్లాడుతూ స్వర్ణముఖినదిపై కప్పగుంటకండ్రిగ వద్ద చెక్ డ్యామ్ నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి, ఏవో విజయభారతి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

గూడూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై వారు అంద జేసే వినతులను పరిశీలించి వాటిని సంబంధితశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. గూడూరు మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా మెరుగు అమృత్ పథకం ద్వారా రూ.73 కోట్లు, డ్రైనేజీ కాలువల అభివృద్ధికి రూ.28 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబునాయుడు, పురపాలకశాఖ మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీవెన్స్ డేకి రాకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు

డక్కిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ డేకి హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు చెప్పారు. సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల దినం కార్యక్రమానికి కొన్ని శాఖల అధికారులు డుమ్మా కొట్టడంపై తహసీల్దార్ అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు దూర ప్రాంతాల నుంచి వారి సమస్యలు చెప్పుకొనేందుకు ఎన్నో వ్యయప్రయాసాలతో వస్తారని, అధికారులు అందుబాటులో లేకపోతే ఏలా అని ప్రశ్నించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన వీఆర్వోలు, వీఆర్‌ఏలకు మెమోలు ఇచ్చారు.

సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ బాధ్యతల స్వీకరణ

నాయుడుపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధి కమిటీ సోమవారం బాధ్యతలు చేపట్టింది. చైర్మన్‌గా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, సభ్యులుగా సగుటూరు ముత్యాల వినయ్‌కుమార్, గోళ్ల వెంకటరమణయ్య, సంపూర్ణమ్మ, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, ఎంపీడీవో సురేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

చిల్లకూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని హెచ్‌ఎం అనసూయ అన్నారు. సోమవారం మండలంలోని పారిచెర్లవారిపాళెం ఉన్నత పాఠశాలకు ఎస్‌ఐ సురేష్‌బాబు రూ.25వేలు విలువ చేసే క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మాధవయ్య, శ్రీనివాసులు, ప్రజేంద్రరెడ్డి, సుగుణ, లావణ్య, రవీంద్ర, సంధ్యారాణి, లీల, మధుసూదన్‌రావు, నాగభూషణమ్మ, విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

దాతల తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

వెంకటగిరి టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దాతల అందించే తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ముత్తూట్ మినీ ఫైనాన్స్ స్టేట్ హెడ్ కన్నబాబు అన్నారు. సోమవారం స్థానిక రాణీపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కొండయ్య నాయుడు, జోనల్ మేనేజర్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

గూడూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 8నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మురళీకుమార్ అన్నారు. జాతీయ తపాల వారోత్సవాల్లో భాగంగా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తామన్నారు. ఈనెల 8,9 తేదీల్లో గూడూరు పట్టణంలోని జడ్పీ బాలిక ఉన్నత పాఠశాల, 10,11 తేదీల్లో సీఎస్ఎం ఉన్నత పాఠశాల, 13,14 తేదీల్లో వీఎస్ఆర్ పాఠశాలలో ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నామని తెలిపారు.

రూ.377 కోట్లతో మున్సిపాలిటీల అభివృద్ధి: విజయశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల్లో రూ.377 కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి ఆమె మీడియాతో మాట్లాడారు. డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం నాయుడుపేట మున్సిపాలిటీకి రూ.18 కోట్లు, సూళ్లూరుపేట మున్సిపాలిటీకి రూ.16 కోట్లు, అలాగే తాగునీటి సరఫరా పనుల కోసం నాయుడుపేట మున్సిపాలిటీకి రూ.201 కోట్లు, సూళ్లూరుపేట మున్సిపాలిటీకి రూ.142 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. మున్సిపల్‌శాఖ ఎస్ఈ మోహన్ మాట్లాడుతూ రెండు మున్సిపాలిటీల్లో డ్రైనేజీ, డిస్ట్రిబ్యూషన్, పైపులైన్, క్లియర్ వాటర్‌పంపు హౌస్‌లు నిర్మిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్‌శాఖ ఈఈ సుబ్బరాయుడు, డీఈ శ్రీనివాసులు, కమిషనర్ ఫజులుల్లా, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, గంగాప్రసాద్, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, రాజేంద్ర, సుబ్బారావు, జీవీఆర్ నాయుడు, నారాయణ, రవి, నిత్యకృష్ణారెడ్డి, చేవూరి చంగయ్య దితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభ్యున్నతికి ప్రభుత్వ కృషి: పాశం


టీడీపీలో చేరిన సర్పంచులతో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని అయ్యవారిపాళెం గ్రామంలో మినీ గోకులం షెడ్ల నిర్మాణ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో పశుసంపద కీలకపాత్ర పోషిస్తుందన్నారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు మినీ గోకులాల నిర్మాణానికి అవసరమైన రాయితీలు, రుణ సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందన్నారు. పాల ఉత్పత్తిని ప్రోత్సహించి పశువుల సంరక్షణను పెంపొందించి రైతు కుటుంబాలు ఆర్థికాభివృద్ధిని, స్వయం ఉపాధిని పెంపొందించేందుకు ప్రత్యేకంగా ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వానికి రైతులందరూ అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన అయ్యవారిపాళెం సర్పంచ్ మంజులమ్మ, మేకనూరు సర్పంచ్ విజయలకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, అమరేంద్ర, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, బిల్లు చెంచురామయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసమే గోకులం షెడ్లు: కురుగొండ్ల


రైతులకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొనే కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లు నిర్మించి ఇస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని కుప్పాయపాళెంలో సోమవారం గోకులం షెడ్లు, సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని చెప్పారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు అమృత్ పథకం ద్వారా రూ.116 కోట్లు మంజూరు అయ్యాయని, వీటితో ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందివ్వడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా డ్రైన్ల నిర్మాణం కోసం మరో రూ.16 కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. పాడి రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, ఇరిగేషన్ డీఈ కోటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ చంద్రశేఖర్, ఏపీవో కుమార్, మాజీ జడ్పీటీసీ రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, సునీల్ రెడ్డి, నాగభూషణం నాయుడు, జనార్దనరెడ్డి, గోపాల్, రమణారెడ్డి, రాజా, పెంచల నర్సయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలికి స్వచ్ఛాంధ్ర అవార్డు


కలెక్టర్ వెంకటేశ్వర్ నుంచి స్వచ్ఛాంధ్ర అవార్డును అందుకుంటున్న పారిశుధ్య కార్మికురాలు ఇందిర

సూళ్లూరుపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికురాలు గుడిపాటి ఇందిర స్వచ్ఛాంధ్ర అవార్డును కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చేతుల మీదుగా అందుకున్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి ప్రభుత్వం అవార్డులు ప్రదానం చేసింది. సోమవారం తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇందిరకు కలెక్టర్ అవార్డు అందజేశారు. ఆమెను మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, కమిషనర్ చిన్నయ్య అభినందించారు.

టీడీపీ నేతకు పలువురి పరామర్శ


ధనుంజయరెడ్డిని పరామర్శిస్తున్న నెలవల

ఓజిలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మానమాలకు చెందిన టీడీపీ నేత, కురుగొండ సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎద్దల ధనుంజయరెడ్డిని సోమవారం సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పరామర్శించారు. ధనుంజయరెడ్డి తల్లి నవనీతమ్మ మృతి చెందిన సమాచారం తెలుసుకున్న నెలవల మానమాలలోని ధనుంజయరెడ్డి గృహానికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, కురుగొండ, కుందాం సొసైటీల చైర్మన్లు అంకయ్య, పురుషోత్తంరాజు, నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, కనుమూరు గోపాల్‌రెడ్డి, పాడి వెంకటసుబ్బయ్య, ఎస్కే ఖలీల్, శ్రీనివాసులు రెడ్డి, సుబ్బారెడ్డి, ఈశ్వరరాజు, వేణు ఉన్నారు.



రెండు ఆటోల ఢీ ఐదుగురికి గాయాలు

కోట, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉత్తమనెల్లూరు వద్ద రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... మండల పరిధిలోని గోవిందపల్లి నుంచి ప్రయాణికులతో కోట వైపు వెళ్తున్న ఆటో, ఎదురుగా వస్తున్న మరో ఆటో ఉత్తమ నెల్లూరుమలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారికి 108 వాహనంలో నెల్లూరు ఆస్పత్రికి తరలించారు.

శివుడికి లక్ష బిల్వార్చన

సూళ్లూరుపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గంగా పార్వతీ సమేత త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివుడికి లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారికి అభిషేకం చేశారు. ఓలేటి బాలసత్యనారాయణ, నాగలక్ష్మి కుమారి ఉభయ కర్తలుగా వ్యవరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సర్వేలపై సమీక్ష

వాకాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్త్రీశక్తి భవనంలో సోమవారం సచివాలయాల సిబ్బందితో ఎంపీడీవో సాయి ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పీ-4, వర్క్‌ఫ్రం హోం సర్వేలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు సకాలంలో అందేలా చూడాలని సూచించారు.

టీ దుకాణ యజమాని ఆత్మహత్య

కోట, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో టీ దుకాణం నడుపుతున్న కొండారాము(46) ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బాలాయపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నూరు, జయంపు గ్రామాల్లో సోమవారం నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. మన్నూరులో వైద్యులు కృష్ణప్రియ, శివసింహాద్రి 50 మందికి, జయంపులో డాక్టర్ రాజేష్ 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. పీఆర్వో శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

రేపటి నుంచి రైల్వేగేట్ మూసివేత

తడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మదీనా కాలనీ రైల్వే గేట్‌ను మంగళవారం నుంచి మూడు రోజులపాటు మూసివేస్తున్నట్లు సదరన్ రైల్వే అధికారులు ప్రకటించారు. మంగళ, బుధ, గురువారాల్లో ఉదయం 8నుంచి సాయంత్రం 6 గంటల వరకు రైల్వే గేట్ మరమ్మతులు చేస్తామని, ఆ సమయంలో రైల్వేగేట్‌ను మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో క్వాంటమ్ సదస్సు

కోట, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ అనైబుల్డ్ అటనామస్ అండర్ వాటర్ వెహికల్ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు. దేశంలోని పలు రాష్ట్రాల ఇంజనీరింగ్ కళాశాలల నుంచి అధ్యాపకులు, రీసెర్చ్ కాలర్స్ పాల్గొన్నారు. వరంగల్ నిట్ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, అనంతపురం ఎస్కే యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ రఘునాథరెడ్డి, రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు.

లింగసముద్రం పంచాయతీని విభజించండి

డక్కిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రం పంచాయతీ పరిధిలోని చాకలపల్లి, నాయుడుపాళెం గ్రామాలను వేరుచేసి కొత్తగా చాకలపల్లి పంచాయతీ ఏర్పాటు చేయాలని ఆ గ్రామాల ప్రజలు కోరారు. సోమవారం సర్పంచ్ పారి వెంకటసుబ్బయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. రెండు గ్రామాల నుంచి హాజరైన స్థానికులు పంచాయతీ విభజనపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కొత్తగా చాకలపల్లి పంచాయతీని ఏర్పాటు చేయాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన

వెంకటగిరి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యా సామగ్రి, బీమా, నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గింపు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా జీఎస్టీపై వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రాంగణం నుంచి త్రిభువని థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు డాక్టర్ రవీంద్రబాబు, కేశవకుమార్, జానకీరామ్, కృష్ణయ్య, శేషు పాల్గొన్నారు.

